
ఆంధ్రజ్యోతి

5 అనంతపురం
జిల్లా వార్తలు
శనివారం 14 డిసెంబరు 2024



ముసురు ముప్పు



బ్యాడిగ మిరప కాయలను కుప్పలుగా పోస్తున్న రైతులు

బ్యాడిగ మిరప సాగు చేసిన రైతులను తుఫాను మబ్బులు వెంటాడుతున్నాయి. కూడేరు మండలంలో వేలాది ఎకరాలలో బ్యాడిగ మిరప సాగు చేశారు. పంట కోత దశలో ముసురు కప్పడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. జల్లిపల్లి రైతు వన్నూరు స్వామి దిగుబడులను తొలగించి రెండు రోజుల క్రితం నుంచి ఆరబెట్టే ప్రయత్నం చేస్తున్నారు. కానీ ఎండ ఏమాత్రం కాయడం లేదు. పైగా అడపా దడపా జల్లులు పడుతున్నాయి. దీంతో మిర్చిని కాపాడుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. పొలంలో కాసేపు ఆరబోయడం.. వర్షం కురిసే సూచన కనిపించగానే కుప్ప చేసి టార్పాలిన్ కప్పడం.. ఇదే సరిపోయిందని రైతులు వాపోతున్నారు. పొరపాటున దిగుబడి తడిస్తే.. కష్టమంతా మట్టిపాలు అవుతుందని ఆందోళన చెందుతున్నారు.

ఆంధ్రజ్యోతి కూడేరు

కన్నుల పండువగా హనుమద్ వ్రతం



సర్వాంగ సుందరంగా కసాపురం అంజన్న ఉత్సవ విగ్రహం (వివరాలు 6లో)

దుర్వాసన.. దుర్వాసన..

డంప్ యార్డుగా మారిన ట్యాంక్ బండ్

ధ్వంసమైన చెరువుకట్ట రోడ్డు



ధ్వంసమైన అనంత-బీకేఎస్ చెరువుకట్ట రోడ్డు
అడుగడుగునా గుంతలు.. ఆక్రమణలు
వైసీపీ హయాంలో నిర్లక్ష్యమే కారణం
సుందరీకరణకు కూటమి ప్రభుత్వం అడుగులు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నగరానికి మణిహారంగా మారుతుందని భావించిన చెరువుకట్ట రోడ్డు దారుణంగా మారింది. ఆ దారిలో వెళ్లేవాహన దారులు దుర్వాసన భరించలేకున్నారు. గుంతలమయమైన దారిలో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఆ ప్రాంతం డంపింగ్ యార్డుకు ఏమాత్రం తీసిపోవడం లేదు. బుక్కరాయసముద్రం-అనంతపురం చెరువుకట్ట రోడ్డు దుస్థితి ఇది. సుందరీకరణతో హైదరాబాద్ ట్యాంక్‌బండ్ తరహాలో ఉంటుందని అందరూ భావించారు. కానీ వైసీపీ హయాంలో నిర్లక్ష్యానికి గురైంది. రోడ్డు మీద మోకాలు లోతు గుంతలు పడ్డాయి. జంతు కళేబరాలు, చెత్తను రోడ్డు పక్కన వేస్తున్నారు. దీంతో ఆ దారిలో ప్రయాణించే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మారిపోతుందా..?

వైసీపీ హయాంలో చెరెవుకట్ట రోడ్డు సుందరీకరణ, అభివృద్ధికి రూ.10కోట్లతో మూడు దఫాలు ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదనలు బుట్టదాఖలయ్యాయి. టీడీపీ హయాంలో చెరువుకట్టపై నిర్మించిన ఎన్టీఆర్ పార్కు మాయమైంది. జిమ్ పరికరాలు కనిపించడం లేదు. పార్కులో పచ్చదనం ఉండాల్సిన చోట పిచ్చిమొక్కలు ఉన్నాయి. దీంతో కూటమి ప్రభుత్వం ట్యాంక్‌బండ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని సూచించింది. మైనర్ ఇరిగేషన్ అధికారులు రూ.11కోట్లతో ట్యాంక్‌బండ్ సుందరీకరణకు ప్రతిపాదనలు పంపారు. ఇకనైనా పరిస్థితిలో మార్పు వస్తుందని నగరవాసులు ఆశిస్తున్నారు.

వైసీపీ నేతల కక్కుర్తి

వైసీపీ హయాంలో బుక్కరాయసముద్రం-అనంతపురం చెరువు కట్ట రోడ్డు సుందరీకరణకు ఓ స్వచ్ఛంద సంస్థ ముందుకొచ్చింది. సుమారు రూ.10కోట్ల అంచనాలతో 'బ్యూటిఫుల్ ట్యాంక్‌బండ్'ను ఆవిష్కరిస్తామని ఆ సంస్థ 2021లో ప్రభుత్వానికి ప్రతిపాదించింది. కానీ ఇద్దరు వైసీపీ ప్రజాప్రతినిధులు పర్సెంటేజీల కోసం బెదిరించడంతో ఆ సంస్థ వదిలేసింది. లేదంటే చెరువుకట్ట అందంగా మారేదని నగరవాసులు అంటున్నారు. దాతల సొమ్ముపై కూడా ఆ పార్టీ నాయకులు కన్నేయడం సిగ్గుచేటని విమర్శిస్తున్నారు.

అసాంఘిక శక్తులకు అడ్డా

2011 ప్రాంతంలో నిర్మించిన చెరువుకట్ట రోడ్డును 2016లో అప్పటి ప్రభుత్వం బాగు చేసింది. వైసీపీ అధికారంలోకి రాగానే ఆ ప్రాంతం అసాంఘిక శక్తులకు అడ్డాగా మారింది. మద్యం సేవించడం, అకృత్యాలకు పాల్పడటం పరిపాటిగా మారింది. పాతూరుకు చెందిన లారీలు, భారీ వాహనాల పార్కింగ్‌కు చెరువుకట్ట రోడ్డుకు వాడుకోవడం ప్రారంభించారు. రోడ్డు స్థలాన్ని వాహనదారులు ఆక్రమించినా అడిగేవారు కరువయ్యారు.

సమన్వయలోపం

చెరువుకట్ట రోడ్డు అభివృద్ధి, నిర్వహణ విషయంలో అధికారుల మధ్య సమన్వయలోపం స్పష్టంగా కనబడుతోంది. మైనర్ ఇరిగేషన్, నగరపాలక సంస్థ, జిల్లా పంచాయతీ, రెవెన్యూ, ఆర్అండ్‌బీ శాఖలు సమన్వయంతో ఆ పనులను చేయాలి. ఆ దిశగా ఆ శాఖల అధికారులు ఆలోచించలేదు. రోడ్డు నిర్మించి పదేళ్లు దాటినా.. క్షేత్రస్థాయిలో పరిశీలించిన దాఖలాలు లేవు.

అభివృద్ధి చేయాలి..

చెరువుకట్ట రోడ్డును అభివృద్ధి చేయాలి. గుంతల రోడ్డు మీద బైకులో వెళ్లాలంటేనే భయంగా ఉంది. రాత్రి పూట లైట్లు వెలగడం లేదు. టీడీపీ హయాంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ పార్కు కనబడటం లేదు. రోడ్డుతో పాటు ఆ పార్కును కూడా అభివృద్ధి చేయాలి. సుందరీకరణ జరిగితే నగరవాసులు ఆనందంగా గడుపుతారు.

- శేఖర్, రాణీనగర్, అనంతపురం

దుర్వాసన భరించలేకున్నాం..

కలెక్టరేట్ నుంచి పాతూరుకు చెరువుకట్ట రోడ్డుపై ట్రాఫిక్ లేకుండా పోవొచ్చు. కానీ కళేబరాలు, కుళ్లిన మాంసం, చెత్తా చెదారంతో ఆ ప్రాంతం దుర్గంధభరితంగా మారింది. దుర్వాసనను భరించలేకున్నాం. శుభ్రం చేయమని ఎవరికి చెప్పాలో తెలియడం లేదు. నగరపాలిక అధికారులకు చెబితే సంబంధం లేదని అంటున్నారు. ఈ ప్రభుత్వమైనా రోడ్డును బాగుచేయాలి.

- మారుతి, పాతూరు, అనంతపురం

రూ.11 కోట్లతో ప్రతిపాదనలు..

చెరువుకట్ట రోడ్డు సుందరీకరణ, అభివృద్ధికి ప్రభుత్వం ప్రతిపాదనలు అడిగింది. రూ.11కోట్ల అంచనాతో ప్రతిపాదనలు పంపాం. గత ప్రభుత్వంలో మూడుసార్లు ప్రతిపాదనలు పంపినా వెనక్కు వచ్చాయి. అనుమతి వచ్చిన వెంటనే పనులను ప్రారంభిస్తాం. ఇప్పటికే చెరువుకట్ట రోడ్డుపై చాలా ఫిర్యాదులు అందాయి. ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుని త్వరగా అనుమతి తీసుకువస్తే హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌లా మార్చవచ్చు. చెరువుకట్ట రోడ్డు జిల్లాకు మణిహారంగా మారుతుంది.

-విశ్వనాథ రెడ్డి, ఎస్ఈ, మైనర్ ఇరిగేషన్



ఆహ్లాదం మాయమై.. దుమ్మూధూళి నడుమ ప్రయాణం..



ఇదీ.. ప్లాన్..

రికార్డులు ఉన్నాయా.. అయితే ఏంటి?
ఇసుక టిప్పర్ డ్రైవర్‌ను చితకబాదిన ఎస్ఐ



పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న టిప్పర్లు, డ్రైవర్ నరేష్

యల్లనూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): సార్.. మా టిప్పర్లకు అన్ని రికార్డులు సక్రమంగా ఉన్నాయి. లైసెన్సులు ఉన్నాయి అని డ్రైవర్ చెబుతున్నా పట్టించుకోకుండా ఓ ఎస్ఐ అతడిని చికబాదాడు. ఈ సంఘటన యల్లనూరు పోలీస్‌స్టేషన్ వద్ద శుక్రవారం జరిగింది. కొందరు ప్రజాప్రతినిధుల మధ్య వివాదాల నేపథ్యంలో కడప జిల్లా ఆర్ఎస్ కొండాపురం మండలం పొట్టిపాడు రీచ్ నుంచి తాడిపత్రి మీదుగా ఇతర ప్రాంతాలకు ఇసుక టిప్పర్లు వెళ్లకూడదని నిబంధనలు ఉన్నట్లు సమాచారం. దీంతో కొందరు టిప్పర్ యజమానులు యల్లనూరు, బుక్కాపురం, నార్పల వయా అనంతపురానికి అన్ని పర్మిట్లు, రికార్డులతో ఇసుకను రవాణా చేస్తున్నారు. అయితే శుక్రవారం మధ్యాహ్నం ఎస్ఐ రాంప్రసాద్ టిప్పర్లను చిత్రావతి బ్రిడ్జి వద్ద ఆపి డ్రైవర్ నరేష్‌ను ఎక్కడికి వెళతావంటూ దుర్భాషలాడుతూ చితకబాదాడు. జిల్లాలో ఇసుకరీచ్‌లు ఎక్కడ ఏర్పాటు చేయకపోవడంతో బిల్డర్లు కడపజిల్లాలోని పొట్టిపాడు రీచ్‌వద్ద ఇసుకను బుక్ చేసుకుంటున్నారు. దీంతో టిప్పర్ యజమానులు లోడు చేసుకొని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. అయితే పోలీసులు వీటికి విరుద్ధంగా టిప్పర్లను అడ్డుకోవడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇసుక టిప్పర్లను స్టేషన్‌కు తీసుకువచ్చిన విషయంపై రూరల్ సీఐ సత్యబాబు వివరణ కోరగా రికార్డులు సరిగా లేకుంటే తీసుకువచ్చి ఉంటారు. డ్రైవర్‌ను చితకబాదిన విషయం తనకు తెలియదని విచారిస్తానని ఆయన తెలిపారు.

బతికిపోయాడు
రైలు పట్టాల నడుమ విద్యార్థి.. చదవడం ఇష్టంలేక ఆత్మహత్యాయత్నం

రాయదుర్గం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): చదవడం ఇష్టం లేదని ఇంట్లో ఎన్నిసార్లు చెప్పినా బడికి పంపిస్తుండటంతో చనిపోవాలని అనుకున్నాడు. రైలు కింద పడేందుకు వెళ్లి.. పట్టాల నడుమ పడుకున్నాడు. గూడ్సు బండి అలాగే వెళ్లిపోయాని.. అదృష్టవశాత్తూ ఏమీ కాలేదు. రాయదుర్గం పట్టణానికి చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థి చావబోయి.. బతికిపోయాడు. పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న బాలుడు మంగళవారం అర్ధరాత్రి స్థానిక రైల్వేస్టేషన్ వద్దకు వెళ్లాడు. స్టేషన్‌కు కూతవేటు దూరంలో రైలు పట్టాలపై పడుకున్నాడు. బళ్లారి వైపు నుంచి గూడ్సు రైలు వస్తుండటంతో ఆత్మహత్యకు సిద్ధమయ్యాడు. లోకో పైలెట్ గమనించి హారన్ కొట్టినా అలాగే ఉండిపోయాడు. కానీ రైలు సమీపించగానే లేచి పట్టాల మధ్యలో పడుకున్నాడు. రైలు ముందుకు సాగిపోయింది. బాలుడు చనిపోయి ఉంటాడని భావించిన లోకో పైలెట్.. రైల్వేపోలీసులకు సమాచారం ఇచ్చారు. లోకేషన్‌ను షేర్ చేశారు. దీంతో పట్టాలను తనిఖీ చేసేందుకు గార్డ్ వాహనంలో గ్యాంగ్‌మెన్ వచ్చారు. అప్పటికీ ఆ విద్యార్థి పట్టాలపై పడుకుని కనిపించాడు. వెంటనే పట్టుకుని ఓబుళాపురం రైల్వేస్టేషన్‌లో అప్పగించారు. సిబ్బంది డయల్ 100కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు కుటుంబ సభ్యులను పిలిపించి, కౌన్సెలింగ్ ఇచ్చి, విద్యార్థిని అప్పగించారు.

ఆశలు అథఃపాతాళానికి.. కుప్పకూలిన టమోటా ధరలు (6లో..)

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం
బండారు శ్రావణి, వెంకటశివుడు యాదవ్
కల్లూరులో వరిధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



వరిధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ తదితరులు

గార్లదిన్నె, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే లక్ష్యంగా ఎన్డీఏ ప్రభుత్వం పాలన సాగిస్తోందని శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ అన్నారు. కల్లూరు మార్కెట్ యార్డులో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు శుక్రవారం ప్రారంభించారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిందని తెలిపారు. వరి ధాన్యానికి క్వింటానికి రూ.2,300 ఇస్తున్నామని తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోగా రైతుల ఖాతాకు డబ్బులు జమచేస్తామని తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధరతోపాటు రావాణ చార్జీలు, గోనె సంచులను ప్రభుత్వమే అందజేస్తోందని తెలిపారు. ప్రభుత్వ ధరకంటే వ్యాపారులు ఎక్కువ ఇస్తే రైతులు వారికే అమ్ముకోవచ్చని అన్నారు. వైసీపీ పాలనలో రైతులకు న్యాయం జరగలేదని విమర్శించారు. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, ఎన్నో ఆంక్షలు పెట్టారని, దళారీలు చెప్పిన ధరకే అమ్మాలని రైతులను నిలువునా దోచుకున్నారని అన్నారు. ఎన్డీఏ ప్రభుత్వానికి ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక వైసీపీ బురద చల్లుతోందని మండిపడ్డారు. ఎన్డీఏ అధికారంలోకి వచ్చిన ఆరు నెలలకే మంచి ప్రభుత్వంగా పేరుతెచ్చుకుందని అన్నారు. ఉనికిని కాపాడుకునేందుకు వైఎస్ జగన్ తంటాలు పడుతున్నారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో కేశవనాయుడు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి, మాజీ ఎంపీపీ ముంటిమడుగు శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దారు బండారు ఈరమ్మ, ఎంపీడీఓ యోగానందరెడ్డి, ఏఓ సోమశేఖర్, ఈఓఆర్డీ దామోదరమ్మ తదితరులు పాల్గొన్నారు.

నాగరాజుకే.. జై..!

అర్హత లేకున్నా ఏఎస్ఓ పోస్టు.. ఎమ్మెల్యే, సంఘాల ఫిర్యాదును కాదని..

విద్యాశాఖలో మరో అడ్డగోలు నిర్ణయం
డీఈఓపై ఒత్తిళ్లు ఉన్నాయని ప్రచారం



నాగరాజు

అనంతపురం విద్య, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో ఇష్టారాజ్యం నడుస్తోంది. అనర్హులకు పట్ట కట్టడం పరిపాటిగా మారింది. ఏఎస్ఓ పోస్టు భర్తీ వ్యవహారంలో ఇది మరోమారు రుజువైంది. డీఈఓ ఆఫీస్‌లో అత్యంత కీలకమైన అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్(ఏఎస్ఓ) పోస్టును అనర్హుడికి కట్టబెట్టారు. వైసీపీ హయాంలో ఏపీఓగా వచ్చిన నాగరాజుకు ఆ పోస్టును రాసిచ్చేశారు. అనంతపురం ఎమ్మెల్యే చేసిన ఫిర్యాదుపై చర్యలు లేకపోగా.. అందలం ఎక్కించారు. మూడేళ్లుగా ఏపీఓగా అక్కడే పనిచేస్తున్న ఆయనకు నామినేటెడ్ పోస్టు తరహాలో జిల్లా విద్యాశాఖ అధికారులు ఏఎస్ఓ పోస్టును కట్టబెట్టారు. విద్యాశాఖ ఏడీలు, సూపరింటెండెంట్లు, ఇతర సిబ్బంది, ఉపాధ్యాయవర్గాలు వ్యతిరేకిస్తున్నా డీఈఓ ప్రసాద్‌బాబు అటువైపే మొగ్గుచూపడం విమర్శలకు తావిస్తోంది. డీఈఓ నిర్ణయంపై విద్యాశాఖ మంత్రి లోకేశ్, ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్‌కు ఫిర్యాదు చేసేందుకు సంఘాల నేతలు సిద్ధమయ్యారు.

ఎందుకంత ప్రేమ..?

జిల్లా విద్యాశాఖలో ఏఎస్ఓ పోస్టు కీలకం. శాఖ మొత్తం సమాచారం తెప్పించడం, విద్యాశాఖ కమిషనర్ నివేదించడంలో ఏఎస్ఓ కీలకంగా వ్యవహరించాల్సి ఉంటుంది. టీచర్ల బదిలీలు, సర్దుబాటు, ప్రమోషన్లు.. ఇలా ప్రతి అంశంలో ఏఎస్ఓ పాత్ర కీలకంగా ఉంటుంది. ఈ పోస్టుకు సహజంగా గణితం స్కూల్ అసిస్టెంట్స్‌ను తీసుకుంటారు. దీంతోపాటు కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్నవారికి ప్రాధాన్యం ఇస్తారు. కానీ ఫిజికల్ సైన్స్ టీచర్ అయిన నాగరాజుకు కట్టబెట్టారు. పైరవీకారులకు ప్రాధాన్యం ఇవ్వడం విద్యాశాఖలో పరిపాటిగా మారింది. కొత్త ఏపీఓగా ఎస్‌జీటీ మంజునాథ్‌ను నియమించారు. ఇటీవలి వరకూ డీఈఓ ఆఫీస్‌లో ఏఎస్ఓగా పనిచేస్తున్న ఓబులరెడ్డిని కళ్యాణదుర్గం నార్త్ స్కూల్‌కు రీప్యాట్రియేషన్ చేశారు. ఆ పోస్టు ఖాళీ పడటంతో వైసీపీ హయాంలో వచ్చిన ఏపీఓ నాగరాజుకు కట్టబెట్టారు. గతంలో ఆయనకు ఏపీఓ పోస్టు ఇవ్వడాన్నే అందరూ తప్పుబట్టారు. ఎస్‌జీటీని నియమించే ఏపీఓ పోస్టులోకి అప్పటి డీఈఓ శామ్యూల్ (ప్రస్తుత ఆర్‌జేడీ) స్కూల్ అసిస్టెంట్ నాగరాజును తీసుకువచ్చారు. వైసీపీ హయాంలో తీసుకున్న ఈ నిర్ణయం విమర్శలకు తావిచ్చింది. ఇప్పుడు మళ్లీ అదే వ్యక్తికి అత్యంతకీలకమైన ఏఎస్ఓ పోస్టు కట్టబెడ్డం గమనార్హం.

ఒత్తిడి నిజమేనా..?

నాగరాజును ఏఎస్ఓ పోస్టు ఇవ్వడం వెనుక ఉన్నతాధికారుల ఒత్తిడి ఉందని బయటకు చెబుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. కలెక్టర్‌తోపాటు, ఆర్‌జేడీ శామ్యూల్ నుంచి ఒత్తిళ్లు ఉండటం వల్లే డీఈఓ ప్రసాద్‌బాబు ఈ నిర్ణయం తీసుకున్నారని అంటున్నారు. ఒత్తిడి నిజమే అనుకున్నా, అర్హత లేనివారికి కీలక పోస్టు ఎలా ఇస్తారని ఉపాధ్యాయ సంఘాల నేతలు ప్రశ్నిస్తున్నారు. జిల్లాలో గణితం స్కూల్ అసిస్టెంట్స్, కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న టీచర్లు వందలాది మంది ఉన్నారు. వారందరినీ కాదని, ఉన్నతాధికారుల ఒత్తిళ్లు అన్న నెపంతో అనర్హుడికి ఇవ్వడం ఏమిటని మండిపడుతున్నారు. ఇప్పటికే నాగరాజుపై అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఏకంగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. 'ఉపాధ్యాయుల సర్దుబాటులో మిగులు ఉపాధ్యాయులకు మంచి స్థానాలు కావాలంటే నన్ను కలవండి. మంచి ప్లేస్ ఇప్పిస్తా అని ఏపీఓ నాగరాజు ప్రలోభ పెట్టారు. కొందరు ఉపాధ్యాయుల నుంచి డబ్బులు తీసుకుని మోసగించినట్లు నా దృష్టికి వచ్చింది. విచారించి చర్యలు తీసుకోండి..' అని ఎమ్మెల్యే ఫిర్యాదు చేశారు. మరికొందరు ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాల నేతలు సైతం ఫిర్యాదు చేశారు. ఇవేవీ పనిచేయలేదు. విద్యాశాఖ అధికారులు తాము అనుకున్న పని చేసేశారు.



డీఈఓ కార్యాలయం

ఫిర్యాదుకు సిద్ధం

జిల్లా విద్యాశాఖ అధికారి తీసుకున్న నిర్ణయంపై పలు ఉపాధ్యాయ సంఘాల నేతలు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్, కమిషనర్ విజయరామరాజుకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారు. వైసీపీ ప్రభుత్వంలో వచ్చిన నాగరాజు అనర్హుడని, అలాంటి వ్యక్తికి కూటమి ప్రభుత్వంలోనూ అవకాశం ఇవ్వడం సరికాదని వారు అంటున్నారు. ఏఎస్ఓ పోస్టు నియామకం దుమారం రేపుతుండటంతో డీఈఓ ప్రసాద్ బాబును వివరణ కోరేందుకు ఆంధ్రజ్యోతి ఫోన్ చేసింది. ఆయన అందుబాటులోకి రాలేదు.


నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు
ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపుతామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు అన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాల ఆవరణలో శుక్రవారం మెగా జాబ్ మేళాను ఆయన ప్రారంభించారు. వందలాది మంది నిరుద్యోగులు తరలివచ్చారు. ఐదో తరగతి నుంచి పీజీ వరకు విద్యార్హతను బట్టి 200 మందికి పైగా అభ్యర్థులకు వివిధ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వంలో సచివాలయ ఉద్యోగాలను మాత్రమే ఇచ్చారని అన్నారు. నేడు నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించి, వారికి అండగా నిలుస్తున్నామని అన్నారు. ఎన్నికల సమయంలో కళ్యాణదుర్గం ప్రాంత యువతలో పట్టుదల, కృషి, నమ్మకాన్ని గుర్తించానని అన్నారు. ఎన్నికల హామీ మేరకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని తెలిపారు. కళ్యాణదుర్గం నియోజకవర్గం వెనుకబడిన ప్రాంతమని ప్రతిఒక్కరూ అంటున్నారని, ఇకపై అభివృద్ధికి చిరునామాగా తీర్చిదిద్దుతామని అన్నారు. సైనికుడిలా పని చేసేందుకు మీ ముందుకు వచ్చానని అన్నారు. జాబ్ మేళాలో మంచి ఉద్యోగం సాధించి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని యువతకు సూచించారు. కార్యక్రమంలో వివిధ కంపెనీల ప్రతినిధులు, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



వివిధ కంపెనీల ప్రతినిధులతో ఎమ్మెల్యే అమిలినేని

తొలి గెలుపు
గుంతకల్లు రైల్వే డివిజన్‌లో ఎంప్లాయీస్ సంఘ్ విజయం
7లో



బతుకు బండి



అనంత శివారు: వృక్ష సంపదకూ వణుకు.. చలికాలం మరి..!





అనంత రైల్వే స్టేషన్: కదలక మెదలక.. కనుచూపు మేరలో రైలు కనిపించక..

చలి వేకువ

పలకరించకు నన్ను
గజ గజా వణికే చలిలో..!
పెదవి పెగలదు నువ్వెంత పిలిచినా..!
తెలతెలవారే వేళ..
మంచు తెమ్మెరలు కమ్మేశాయి..
హిమ బిందువులు..
చలిలో కలిసి సూదుల్లా పొడుస్తున్నాయ్..!
నగరం పొగచూరిన వేళ..
పలకరించకు నన్ను..!
ఉబ్బసం లేకపోయినా..
ఊపిరి అందడం లేదు..!
భయపడకపోయినా..
వణుకు ఆగడం లేదు..!
పలకరించకు నన్ను..!



శాగబారిన మనిషి వణికిపోతున్నాడు.. ఏం చలిరా బాబూ..!



అనంత హైవే: చలికాల మహిమ..!
మండే సూరీడు.. నిండు చందురుడిలా..!

గ్రంథాలయ ఉద్యోగుల కార్యవర్గం ఎంపిక



కొత్త కార్యవర్గ సభ్యులు

అనంతపురం విద్య, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం కొత్త కార్యవర్గం ఎంపిక చేశారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు జయరాం అధ్యక్షతన శుక్రవారం ఎన్జీవో హోంలో సమావేశం నిర్వహించారు. గతంలో ఉన్న జిల్లా అడ్‌హక్ కమిటీని రద్దు చేసి నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడిగా కటిక జయరాం, సహాధ్యక్షులుగా కృష్ణ, రమేష్ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా బొజ్జేనాయక్, సహాయ కార్యదర్శిగా ఇబ్రహీం, ట్రెజరర్‌గా శ్రీనివాసులు, కార్యవర్గసభ్యులుగా వెంకట రమణప్ప, మల్లికార్జున, నల్లమ్మ, మహిళా కార్యదర్శులుగా ముత్యాలమ్మ, ఉషారాణి, శాంతమ్మ, ఉజ్జనేశ్వరి, నాగరాజును ఎంపికచేశారు. వారితో రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు ప్రమాణ స్వీకారం చేయించారు. ఆయన మాట్లాడుతూ గ్రంథాలయ ఉద్యోగులకు 010 పద్దు కింద జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాబ్జీ, కన్వీనర్ తోకల రాంబాబు, ఇతర నేతలు పాల్గొన్నారు.

రెండు స్వచ్ఛంద సంస్థలకు జాతీయ అవార్డులు



అవార్డు అందుకుంటున్న సెంటర్ ఫర్ కలెక్టివ్ డెవలప్‌మెంట్, ఫార్మ్ వేదా సంస్థ ప్రతినిధులు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని సెంటర్ ఫర్ కలెక్టివ్ డెవలప్‌మెంట్, ఫార్మ్‌వేదా స్వచ్ఛంద సంస్థలకు జాతీయ స్థాయి అవార్డులు దక్కాయి. వికసిత్ భారత్ నిర్మాణంలో భాగంగా ఉమ్మడి జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో పేదలు, రైతుల జీవనోపాధుల పెంపునకు ఈ సంస్థలు కృషి చేస్తున్నాయి. వీటి సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వ అనుబంధ సంస్థ సోషల్ అండ్ బిజినెస్ ఎంటర్‌ప్రైజెస్ రెస్పాన్సిబుల్ (సబేరా) అవార్డుకు ఎంపిక చేశారు. దేశరాజధాని ఢిల్లీలోని ఇండియా హాబిటాట్ సెంటర్‌లో గురువారం నిర్వహించిన సబేరా అవార్డుల ప్రదానోత్సవంలో సీసీడీ ప్రాజెక్ట్ మేనేజర్లు నటరాజ్, శంకర్, విఠల్‌రావు, ఫార్మ్‌వేదా సంస్థ సీఈఓ కౌశల్ అవార్డులు అందుకున్నారు. సీసీడీ వ్యవస్థాపకుడు త్రిలోచన్ శాస్త్రి మేనేజర్లను అభినందించారు.

ప్రమాదాల్లో ప్రాణాలను కాపాడటమే లక్ష్యం

■ డీఆర్ఎం విజయకుమార్



సదస్సులో మాట్లాడుతున్న డీఆర్ఎం విజయ కుమార్

గుంతకల్లు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): విపత్తులు, ప్రమాదాలు సంభవించినప్పుడు వీలైనన్ని ఎక్కువ ప్రాణాలను కాపాడటానికి సివిల్ డిఫెన్స్ ఆర్గనైజేషన్ (సీడీఓ) సభ్యులు కృషి చేయాలని డీఆర్ఎం విజయకుమార్ పేర్కొన్నారు. సివిల్ డిఫెన్స్ ఆర్గనైజేషన్ వార్షికోత్సవంలో భాగంగా దక్షిణ మధ్య రైల్వే, సదరన్ రైల్వే జోన్ల పరిధిలో తర్ఫీదు పొందిన రైల్వే ఉద్యోగుల సదస్సును గుంతకల్లు డివిజన్ హెడ్‌క్వార్టర్సులోని రైల్వే స్టేషన్ ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించారు. సీడీఓ సభ్యులు చెన్నైలో ప్రదర్శించిన మాక్ డ్రిల్ విన్యాసాలను వీడియో ప్రజెంటేషన్ నిర్వహించారు. అనంతరం ప్రతిభచాటిన సివిల్ డిఫెన్స్ ఆర్గనైజేషన్ సభ్యులకు మెమెంటోలను అందజేశారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం సుధాకర్, దక్షిణ మధ్య రైల్వే డీజీఎం ఉదయనాథ్ కోట్ల, ఏడీజీఎం కేఎల్ఎన్ స్వామి, సీనియర్ సీడీఐ టీ సుధీర్ బాబు, సదరన్ రైల్వే ఏడీజీఎం చెలియన్, సీనియర్ సీడీఐ చిట్టమల్ల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్బిటార్ పరీక్షల్లో గోవిందరాజులు ఉత్తీర్ణత



గోవింద రాజులు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ చదరంగసమాఖ్య, అఖిలభారత చదరంగ సమాఖ్యలు సంయుక్తంగా శుక్రవారం రాజమండ్రిలో నిర్వహించిన సీనియర్ నేషనల్ ఆర్బిటార్ పరీక్షల్లో అనంతపురానికి చెందిన కోచ్ గోవిందరాజులు ఉత్తీర్ణత సాధించారు. నేషనల్, ఇంటర్నేషనల్ చెస్ పోటీలకు గోవిందరాజులు ఆర్బిటార్‌గా పనిచేసే అవకాశం వస్తుంది.



తోటలోనే ఎర్రగా మాగిపోయిన టమోటా

నాలుగు రోజుల్లోనే ..

నాకున్న మూడు ఎకరాల్లో టమోటా పంట సాగు చేశారు. నాలుగు రోజుల కిందట 16 కిలో ల టమోటా బాక్స్ ధర రూ.800 లకు అమ్ముడుపోయింది. ఆ ధర ఇప్పుడు కేవలం రూ. 20లకు పడిపోయింది. ఇలా ధర ఒక్కసారిగా పడిపోవడంతో ఆందోళన చెందుతున్నాం.

- రామాంజనేయులు, టమోటా రైతు, మేళ్లకుంట





కుప్పకూలిన టమోటా ధరలు

- 16 కేజీల బాక్స్ రూ.20 నుంచి రూ.200
- కొన్ని రోజుల కిందట బాక్స్ రూ.800
- నాలుగైదు రోజుల్లోనే తలకిందులైన ధరలు



ఒకే చోట కుప్పగా పోసిన టమోటా

ఆశలు అధఃపాతాళానికి..

కళ్యాణదుర్గం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): టమోటా ధరలు రైతుల ఆశలతో దోబూచులాడుతున్నాయి. ధర బాగుంది కదా అని సాగు చేస్తే పంట చేతికందేలోపు అథఃపాతాళానికి చేరుతున్నాయి. కూలీల ఖర్చు కూడా గిట్టుబాటు కావడం లేదు. దీంతో పలువురు రైతులు తోటల్లోనే టమోటాలను పశువుల మేతగా వదిలేసే దుస్థితి నెలకొందని వాపోతున్నారు. మొన్నటి వరకు అనంతపురం, కర్ణాటక(కోలార్), మదనపల్లి మార్కెట్‌లో 16 కిలోల టామోటా బాక్స్ రూ.800లు పలికింది. అదే ప్రస్తుతం రూ. 20 నుంచి రూ. 200ల మధ్య నడుస్తోంది. ఏ1 గ్రేడ్ టమోటాలు మాత్రమే బాక్స్ రూ. 200లు ధర పలుకుతోంది. ఈ ధరలు ఇంకా తగ్గే అవకాశాలు ఉన్నట్లు మార్కెట్ వర్గాల సమాచారం. టమోటా ధరలు నిలకడగా లేకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, బ్రహ్మసముద్రం, కళ్యాణదుర్గం రూరల్ మండలాల్లో సుమారు 487 ఎకరాలకు పైబడి టమోటా పంటను సాగు చేశారు. ఎకరాకు రూ.లక్ష ఖర్చు చేసి, ఒక్కొక్క రైతు సరాసరి రెండున్నర ఎకరాలకు పైబడి సాగు చేశారు. టమోటా పంటలన్నీ కోతకు వస్తున్న సమయంలో ఇలా ధరలు పడిపోవడంతో నష్టాలు తప్పవని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధరలు తగ్గుముఖం పట్టడానికి కారణాలు అర్థం కావడం లేదు. టమోటాను మొన్నటివరకు కొనేందుకు వ్యాపారులు ఎగబడ్డారు. ధరలు బాగుంటాయన్న ఆశతో విపరీతంగా రైతులు టమోటాను సాగు చేశారు. కానీ ఆశలు ఫలించడం లేదు.



టమోటాను తొలగిస్తున్న కూలీలు

పెట్టుబడి కూడా చేతికిరాదు



నేను మూడు ఎకరాల్లో టమోటా సాగు చేశా. సుమారు రూ. 3 లక్షలదాకా పెట్టుబడి పెట్టా. 16 కిలోల టమోటా బాక్స్ మొన్నటివరకు ఏడెనిమిది వందల రూపాయాల మధ్య ఉండేది. అదే ధర ఇప్పుడు రూ.20కి పడిపోయింది. దీంతో పెట్టుబడి కూడా చేతికి రాని పరిస్థితి నెలకొంది.

-నరేష్, టమోటా రైతు, ఒంటారెడ్డిపల్లి

తోటల్లోనే వదిలేసే పరిస్థితి



ధరలు భారీగా తగ్గడంతో టమోటాను తోటల్లోనే వదిలేసే పరిస్థితి నెలకొంది. నాలుగైదు రోజుల్లోనే ధరలు ఇలా తలకిందులైతే పెట్టుబడి కూడా దక్కే పరిస్థితి కనబడటం లేదు. మరికొన్ని రోజులు ధరలు ఇలాగే ఉంటే భారీ నష్టాలు మూటగట్టుకోవాల్సిందే.

- రవి, టమోటా రైతు, ఒంటారెడ్డిపల్లి

ప్రభుత్వం ఆదుకోవాలి

ఈ సారైనా టమోటాతో గట్టెక్కవచ్చునన్న ఆశతో పంట సాగు చేస్తే.. ధరలు భారీగా తగ్గిపోయాయి. టమోటా బాక్స్ రూ.20 అంటే నష్టాలు ఎదుర్కోక తప్పదు. అందుకోసమే టమోటా పంటను సాగు చేయాలంటే భయపడే పరిస్థితులు వచ్చాయి. టమోటా రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి.



-రామాంజి, టమోటా రైతు, మేళ్లకుంట

మార్కెట్‌కు తగ్గిన కాయలు

అనంతపురంరూరల్: కక్కలపల్లి మార్కెట్‌లో టమోటా ధరలు పతనమయ్యాయి. స్థానిక మార్కెట్ నుంచి ఎగుమతి అయ్యే ప్రాంతాల్లో టమోటా దిగుబడులు అధికంగా వస్తుండటంతో ఇక్కడి టమోటకు డిమాండ్ తగ్గి, ధర పతనమైనట్లు సమాచారం. కొన్నిరోజులుగా నిలకడగా ఉన్న ధరలు గత నాలుగైదు రోజుల నుంచి భారీగా పడిపోయాయి. గతంలో ఓమాదిరి కాయలు, మచ్చలు ఇతరత్రకాయల సైతం మంచి ధర పలికాయి. కిలో గరిష్ఠంగా రూ.30 నుంచి రూ.40మధ్య పలికాయి. కనిష్ఠ ధరలు సైతం రూ.20 నుంచి 30మధ్య ఉన్నాయి. ప్రస్తుతం కాయల నాణ్యత బాగున్నప్పటికీ ధర లేకపోవడంతో రైతులు మరింత ఆందోళన చెందుతున్నారు. మార్కెట్‌కు కాయలు కూడా అంతంత మాత్రంగానే వస్తున్నాయి. గతంలో పదిహేను వందల నుంచి 2వేల టన్నుల వరకు వచ్చేవి. ప్రస్తుతం 700 నుంచి 12వందల టన్నుల మధ్య వస్తున్నాయి. కాగా శుక్రవారం మార్కెట్‌కు 1125టన్నుల టమోటా వచ్చాయి. గరిష్ఠ ధర కిలో రూ.10, సరాసరి ధర రూ.6, కనిష్ఠ ధర రూ.4తో అమ్ముడుపోయాయి.



కసాపురంలో హనుమద్ వ్రతాన్ని నిర్వహిస్తున్న వేద పండితులు, అర్చకులు

కన్నుల పండువగా హనుమద్ వ్రతం

పాల్గొన్న వేలాదిమంది భక్తులు

గుంతకల్లు, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): కసాపురం దేవస్థానంలో శుక్రవారం ఉదయం హనుమద్ వ్రతాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. హనుమద్ మండల, అర్ధ మండల దీక్షలను చేపట్టిన మాలధారులు గురువారం ఇరుముడులతో ఆలయానికి చేరిన సంగతి తెలిసిందే. ఉదయాన్నే అంజనేయ స్వామివారి మూల విరాట్టుకు అభిషేకాలు, ప్రత్యేక అలంకారాలు చేసి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కల్యాణ మండపం వద్ద ఉన్న ఓపెన్ షెడ్‌లో వేదికను ఏర్పాటుచేసి, అంజనేయ స్వామి ఉత్సవ విగ్రహాన్ని అక్కడ ఉంచి సర్వాంగ సుందరంగా అలంకరించారు. వేదపండితులు, అర్చకుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా హనుమద్ వ్రతాన్ని నిర్వహించారు. మాలధారులు వేదిక ఎదుట భక్తి పారవశ్యంతో వ్రత కార్యక్రమాన్ని వీక్షించారు. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కుటుంబ సమేతంగా హనుమద్ వ్రత కార్యక్రమంలో పాల్గొన్నారు. తర్వాత వేద పండితులు, అర్చకులు ఆనవాయితీని అనుసరించి దీక్షాపరులచే హనుమాన్ మాల విసర్జనగావించారు. వ్రతంలో ఉపయోగించిన హనుమాన్ కంకణాలు, ప్రసాదాల కోసం భక్తులు ఎగబడ్డారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆర్ శ్రీనాథ్‌గౌడు, బీఎస్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హనుమద్ వ్రతంలో పాల్గొన్న మాలధారులు

ఎయిమ్స్‌లో అనంత మెడికో సత్తా



భానుప్రసాద్‌కు స్వీట్లు తినిపిస్తున్న తల్లిదండ్రులు

అనంతపురం టౌన్, డిసెంబరు13 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన మెడికో దేశరాజధానిలో సత్తా చాటాడు. న్యూఢిల్లీలోని ఎయిమ్స్‌లో ఎంసీహెచ్ ఇన్ యురాలజీ(పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సు)లో ప్రథమ ర్యాంకు సాధించాడు. గత నెలలో పరీక్షలు జరగగా గురువారం రాత్రి ఫలితాలు విడుదల చేశారు. ఇందులో అనంతపురానికి చెందిన భానుప్రసాద్‌యాదవ్ ప్రథమర్యాంకు సాధించాడు. భోపాల్‌లో ఎంబీబీఎస్ పూర్తి చేసిన ఈయన ఢిల్లీలోని ఎయిమ్స్‌లో పీజీ చదువుతూ గోల్డ్ మెడల్ సాధించాడు. ఈయన తండ్రి ఆత్మకూరు మండలం ఎంఈఓ-2గా పనిచేస్తుండగా, తల్లి క్షీరజ అదే మండలంలోని తోపుదుర్తి జడ్పీ ఉన్నతపాఠశాలలో బయాలజీ టీచర్‌గా పని చేస్తున్నారు. తమ కుమారుడు జాతీయస్థాయిలో ప్రతిభ చాటడంతో ఆ తల్లిదండ్రులు పుత్రోత్సాహంతో పొంగిపోయారు.

జాతీయ చెస్ పోటీలకు నితీష్‌చౌదరి ఎంపిక



నితీష్‌చౌదరి

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన నితీష్‌చౌదరి 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14 పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల లేపాక్షిలో నిర్వహించిన 68వ ఎస్‌జీఎఫ్-14 చెస్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభచాటిన నితీష్‌చౌదరి జాతీయ పోటీలకు అర్హత సాధించాడు. ఈ పోటీలను మహారాష్ట్రలోని నాందేడ్‌లో వచ్చే ఏడాది జనవరి 21 నుంచి నిర్వహించనున్నారు. నితీష్‌చౌదరిని ఇంటర్నేషనల్ చీఫ్ ఆర్బిటార్ ఉదయ్‌కుమార్‌నాయుడు అభినందించారు.

కుటీర పరిశ్రమలకు సబ్సిడీ

అనంతపురం అర్బన్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఔత్సాహికులు, డ్వాక్రా మహిళా సంఘాలకు ఆహార శుద్ధి కుటీర పరిశ్రమల స్థాపన కోసం ప్రభుత్వం సబ్సిడీ ఇస్తోందని ఉద్యాన శాఖ జిల్లా అధికారి నరసింహారావు శుక్రవారం తెలిపారు. పీఎంఎఫ్ఎంఈ కింద దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండిన యువత, నిరుద్యోగులు, మహిళలు, రైతులు, మహిళా సంఘాలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్రాజెక్టు విలువలో లబ్ధిదారులు 10 శాతం భరిస్తే, 35 శాతం ప్రభుత్వం రాయితీ కల్పిస్తుందన్నారు. మిలిగిన 55 శాతం బ్యాంకుల రుణం లభిస్తుందన్నారు. గరిష్ఠంగా రూ.10 లక్షల దాకా సబ్సిడీని వర్తింపజేస్తారన్నారు. వివరాలకు ఫుడ్ ప్రాసెసింగ్ జిల్లా రిసోర్స్ పర్సన్ హరీష్ సెల్ నెంబర్ 9676796974ను సంప్రదించాలని సూచించారు.

న్యూస్‌బాక్స్

చీనీ టన్ను రూ.29 వేలు

అనంతపురం రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.29వేలు, కనిష్ఠంగా రూ.6వేలు, సరాసరి రూ.20వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 39 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

నీటి నిల్వ 1.667 టీఎంసీలు

బెళుగుప్ప, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయరులో ప్రస్తుత నీటి నిల్వ 1.667 టీఎంసీలు వున్నట్లు శుక్రవారం హంద్రీనీవా అధికారులు తెలిపారు. ఇన్‌ఫ్లో 793 క్యూసెక్కులు ఉండగా ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 719 క్యూసెక్కులు వెళుతున్నట్లు వెల్లడించారు.

నేడు, రేపు మానవహక్కుల వేదిక రాష్ట్ర మహాసభలు

అనంతపురం కల్చరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉభయ తెలుగు రాష్ట్రాలకు సంబంధించి అనంతపురం నగరంలో శని, ఆదివారాల్లో మానవ హక్కుల వేదిక 10వ రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని వేదిక రాష్ట్ర అధ్యక్షుడు యూజీ శ్రీనివాసులు బుధవారం ప్రకటనలో తెలిపారు. 'కులగణన ఎందుకు అవసరం' అనే అంశంపై సామాజిక విశ్లేషకుడు ఎస్ఎన్ సాహూ, 'బస్తర్‌లో మానవ హక్కుల ఉల్లంఘనలు' అనే అంశంపై జర్నలిస్టు మాలినీ సుబ్రహ్మణ్యం, 'కాషాయీకరణ, కార్పొరేటీకరణ' అంశాలపై చరిత్ర విశ్రాంత అధ్యాపకుడు కొప్పర్తి వెంకటరమణమూర్తి ప్రసంగిస్తారని తెలిపారు. అన్నివర్గాల ప్రముఖులు, ప్రజలు మహాసభల్లో పాల్గొని, విజయవంతం చేయాలని యూజీ శ్రీనివాసులు పిలుపునిచ్చారు.

క్రైం కార్నర్

హంద్రీనీవా కాలువలో యువకుడి గల్లంతు


ఆదికేశవరెడ్డి (ఫైల్)

గుంతకల్లుటౌన్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని కసాపురం గ్రామ సమీపంలో పెద్దవడుగూరు మండలానికి చెందిన 19ఏళ్ల యువకుడు యు.ఆదికేశవరెడ్డి హంద్రీనీవా కాలువలో గల్లంతయ్యాడు. కసాపురం పోలీసులు తెలిపిన మేరకు పెద్దవడుగూరు గ్రామానికి చెందిన ఆదికేశవరెడ్డి ఐషర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం ఇంట్లో ఎవరికి చెప్పకుండా కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయానికి వెళ్లాడు. ఉదయం కసాపురం గ్రామ సమీపంలో ఉన్న హంద్రీనీవా కాలువలోకి స్నానానికి దిగాడు. నీటిలో మునిగాడు. అయితే ఎంత సేపటికి బయటకు రాకపోవడంతో అక్కడే ఉన్న కొంతమంది మాలధారులు కసాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని గాలింపు చేపట్టారు. తండ్రి శ్రీనివాసులరెడ్డి ఫిర్యాదు మేరకు కసాపురం పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఆటో డ్రైవర్‌పై పోక్సో కేసు

కల్లూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అనంతపురానికి చెందిన ఓ ఆటో డ్రైవర్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు చిత్తూరు జిల్లా కల్లూరు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. అనంతపురం నగరానికి చెందిన ఓ బాలిక(15) చిత్తూరు జిల్లాలో చదువుకుంటోంది. డిసెంబరు 3వ తేదీన కళాశాల వద్దకు వచ్చిన హరికృష్ణ ఆమెను తన వెంట అనంతపురం తీసుకెళ్లాడు.ఓ గుడిలో పెళ్లి చేసుకోవాలని చెప్పగా ఆమె నిరాకరించింది. దీంతో హరికృష్ణ బలాత్కారానికి ప్రయత్నించగా ఆమె తప్పించుకొని తల్లిదండ్రుల వద్దకు చేరుకుంది. ఈ క్రమంలో ఈనెల 10న బాలిక తల్లి కల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోక్సో కేసు నమోదు చేశారు. గురువారం సాయంత్రం కల్లూరులో హరికృష్ణను అరెస్టు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆరు నెలల తర్వాత పోస్టుమార్టం


చరణ్ (ఫైల్)

డీ.హీరేహాళ్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు నీటికుంటలో పడి మృతి చెందిన బాలుడు చరణ్(7) మృతదేహానికి శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించారు. మండలంలోని మల్లికేతి గ్రామానికి చెందిన వెంకప్ప, అంజమ్మ దంపతులకు ముగ్గురు సంతానం. ఇందులో ఆఖరివాడైన చరణ్ ఆరునెలల కిందట గ్రామ సమీపంలో స్నేహితులతో ఆడుకుంటూ ప్రమాదవశాత్తు అక్కడ ఉన్న నీటికుంటలో పడి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు మరుసటి రోజే ఆ పిల్లవాడి అంత్యక్రియలు పూర్తి చేశారు. అయితే నెల రోజుల కిందట బాలుడి మృతిపై తమకు అనుమానం ఉందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి శుక్రవారం మల్లికేతి గ్రామానికి చేరుకొని అనంతపురం ఫోరెన్సిక్ వైద్యుల పర్యవేక్షణలో శవాన్ని వెలికి తీయించారు. అనంతరం మృతదేహంలోని భాగాలను అనంతపురం ఫోరెన్సిక్ ల్యాబ్‌కు తరలించారు. ఫోరెన్సిక్ ల్యాబ్ నుంచి వచ్చే నివేదిక మేరకు విచారణ చేపడతామని ఎస్ఐ తెలిపారు.

ఇక స్వర్ణ పంచాయతీలు..!

- ఆన్‌లైన్‌లో పల్లె సేవలు
- వచ్చేనెల నుంచి డిజిటలైజేషన్
- స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో వివరాలు
- ఆన్‌లైన్‌లోనే ధ్రువీకరణ పత్రాలు
- ఎక్కడి నుంచైనా పన్నులు చెల్లించే అవకాశం



స్వర్ణపంచాయతీ పోర్టల్


వివరాలను పొందుపరుస్తున్న సిబ్బంది

హిందూపురం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పల్లె సేవలను ఇకపై ఎక్కడి నుంచైనా పొందవచ్చు. గ్రామ పంచాయతీల్లో డిజిటల్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఇక మీదట ఎక్కడినుంచైనా పంచాయతీకి పన్ను చెల్లించవచ్చు. కావాల్సిన ధ్రువపత్రాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్.. పంచాయతీలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగానే డిజిటలైజేషన్ దిశగా ముందుకెళ్తున్నారు. జిల్లాలో 467 పంచాయతీలు ఉండగా అన్నింటిలోనూ వచ్చేనెల నుంచి ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. దీంతో పల్లె ప్రజల కష్టాలు తీరనున్నాయి. ప్రజలకు వేగంగా, పారదర్శకంగా ప్రభుత్వ సేవలు అందనున్నాయి. జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు కావాలంటే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. వారంలోపే జారీ అవుతాయి. ఆన్‌లైన్‌లోనే ఆస్తిపన్ను చెల్లించవచ్చు. ట్రేడ్ లైసెన్స్ పొందవచ్చు. వీటికి సంబంధించి కార్యదర్శులకు డిజిటల్ కీ అందుబాటులోకి తీసుకురానున్నారు. ఏ డిజిటల్ పత్రం కావాలన్నా ఆన్‌లైన్‌లో క్లియర్‌గా ఉండనుంది. జిల్లాలోని 467 పంచాయతీల్లో ఈ కొత్త విధానాన్ని అమలు చేయనున్నారు. పంచాయతీలు జారీచేసే వివిధ ధ్రువీకరణ పత్రాలకు ప్రజలు తిరగాల్సిన అవసరం ఉండదు. ఇకమీదట సులభంగా సర్టిఫికెట్లు పొందేందుకు పంచాయతీ రాజ్ శాఖ కొత్త విధానానికి శ్రీకారం చుట్టనుంది. మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుంటే వాటిని పంచాయతీ కార్యదర్శులు పరిశీలించి, డిజిటల్ సంతకాలు చేస్తారు. అనంతరం ప్రజలు ఎక్కడ మీసేవలో దరఖాస్తు చేసుకున్నారో అక్కడే సర్టిఫికెట్లు పొందవచ్చు. ఈ విధానం మున్సిపాలిటీల్లో అమలులో ఉంది. జనవరి నుంచి పల్లెల్లో కూడా అందుబాటులోకి రానుంది.

వైసీపీ నిర్లక్ష్యం

ప్రజలకు సత్వర సేవలందించే ఉద్దేశంతో పంచాయతీలను డిజిటల్ వైపు తీసుకొచ్చేందుకు ఒక పోర్టల్‌ను తెచ్చింది. దీని నిర్వహణ అప్పట్లో నేషనల్ ఇన్ఫర్మేటిక్ సెంటర్ (ఎన్ఐసీ)కి అప్పగించింది. వైసీపీ అధికారంలోకి వచ్చాక దానికి నిధులు ఇవ్వకపోవడంతో పోర్టల్ నిర్వహణ గాలికి వదిలేశారు. ఐదేళ్లుగా పంచాయతీలు డిజిటల్ వైపు వెళ్లకుండా మూలనపడింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక స్వర్ణ పంచాయతీ పోర్టల్ నిర్వహణను రాష్ట్ర ఆర్థిక నిర్వహణ సేవాసంస్థకు అప్పగించింది.

ఇందుకు సంబంధించి మార్గదర్శకాలను ప్రభుత్వం పంచాయతీ కార్యాలయాలకు జారీ చేసింది. పంచాయతీల్లో పాయింట్ ఆఫ్ స్కేల్, పరికరాలు సిద్ధం చేస్తున్నారు. వీటిలో డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా చెల్లించవచ్చు. క్యూఆర్ కోడ్ కూడా అందుబాటులోకి రానుంది. ప్రజల నుంచి వసూలైన మొత్తాలు పంచాయతీల ఖాతాల్లోకి జమయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు.

ఆన్‌లైన్ విధానంలో ఇలా..

పంచాయతీల ద్వారా జనన, మరణ ధ్రువీకరణ పత్రాలను మాన్యువల్ పద్ధతిలో జారీచేస్తున్నారు. ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకున్న వెంటనే అందులో నమోదు చేసిన ఫోన్ నంబరుకు దరఖాస్తు సంఖ్య మెసేజ్ రూపంలో వస్తుంది. ప్రక్రియ పూర్తికాగానే దరఖాస్తుదారుడు ఫోన్ నంబరుకు మెసేజ్ రూపంలో సమాచారం అందుతుంది. కొత్త విధానం అమలులోకి రావడంతో పంచాయతీ కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుంటే సర్టిఫికెట్లు పొందవచ్చు.

స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో...

ఇప్పటి వరకు పంచాయతీకి పన్నులు చెల్లించాలంటే సిబ్బంది ఇంటివద్దకు వచ్చేవారు. ప్రజలకే కార్యాలయాలకు వెళ్లేవారు. ఇకపై దేశంలో ఏ మూలనుంచైనా గ్రామంలోని ఇంటికి ఏటా ఆస్తిపన్ను చెల్లించవచ్చు. నేరుగా ఆన్‌లైన్‌లో ఆస్తిపన్ను వివరాలు తెలుసుకోవచ్చు. ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన స్వర్ణ పంచాయతీలో డిజిటల్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ట్రేడ్ లైసెన్స్, భవన నిర్మాణ అనుమతులు, వివాహ, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలతోపాటు ఇతర ఏ సేవలైనా ఆన్‌లైన్‌లో పొందవచ్చు.

మొదటి విడతలో...

పంచాయతీల్లో మొదటి విడతలో ముఖ్యమైన సేవలు ఆన్‌లైన్‌లో పొందవచ్చు. ముఖ్యంగా ఆస్తి విలువ, ధ్రువీకరణ పత్రాలు, వ్యాపార లైసెన్స్‌లు జారీ అయ్యేలా చూస్తారు. జనన, మరణ, వివాహ ధ్రువీకరణ పత్రాలు, చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుకు ఎన్ఓసీ, భవన నిర్మాణ అనుమతులు ఆన్‌లైన్‌లో ఇవ్వనున్నారు. పంచాయతీల్లో అందించే 80 రకాల సేవలను క్రమేపీ స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో నమోదు చేయనున్నారు. దీంతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే చాలు సేవలు పొందవచ్చు.

93 శాతం పూర్తి

జిల్లాలోని 33 పంచాయతీల్లో 467గ్రా పంచాయతీల పరిధిలో వివరాలు సేకరిస్తున్నారు. ఇప్పటికే 96శాతం పూర్తయినట్లు తెలుస్తోంది. పంచాయతీ కార్యదర్శులు డిజిటల్ సంతకాలను బయోమెట్రిక్ నమోదు చేస్తారు. ప్రతి ఇంటి నుంచి అన్ని వి వరాలను సేకరించి, సమగ్రంగా ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లో పొందుపరుస్తారు. వీటిని స్వర్ణపంచాయతీ పోర్టల్‌లో అందుబాటులోకి తెస్తారు. ఆ దిశగా జిల్లా యంత్రాంగం పనిచేస్తుంది.

తొలి గెలుపు

గుంతకల్లు రైల్వే డివిజన్‌లో ఎంప్లాయీస్ సంఘ్ విజయం

గుంతకల్లు, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): రైల్వే ఉద్యోగ సంఘ గుర్తింపు ఎన్నికల్లో ఎంప్లాయీస్ సంఘ్ గుంతకల్లు రైల్వే డివిజన్‌లో తొలిసారి గెలుపు సాధించింది. దేశవ్యాప్తంగా నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వేమెన్ (ఎన్ఎఫ్ఐఆర్) గతంలో కంటే మెరుగైన విజయాలను నమోదుచేసింది. ఎన్ఎఫ్ఐఆర్‌కు అనుబంధంగా ఉన్న ఎంప్లాయీస్ సంఘ్ దక్షిణ మధ్య రైల్వే జోన్‌లో ఆరుచోట్ల ఆధిపత్యం సాధించింది. దేశవ్యాప్తంగా జరిగిన ఈ ఎన్నికల్లో ఎన్ఎఫ్ఐఆర్, ఏఐఆర్ఎఫ్ ఉద్యోగ సమాఖ్యలు దాదాపు సమాన ఆధిపత్యాలను ప్రదర్శించాయి.

తక్కువ చోట్ల గెలిచినా యూనియన్ ఆధిక్యం

ఈ రైల్వే ఎన్నికల్లో ఎంప్లాయీస్ సంఘ్ ఎక్కువ చోట్ల గెలుపొందినా, మజ్దూర్ యూనియన్ జోన్ స్థాయిలో ఆధిక్యం కనబరిచింది. ఇప్పటిదాకా 2007, 2013 సంవత్సరాల్లో రైల్వే ఉద్యోగ సంఘ గుర్తింపు కోసం ఎన్నికలు జరిగాయి. తర్వాత 2018లో ఎన్నికలు జరగాల్సి ఉండగా వాయిదాపడి ఈ నెలలో జరిగాయి. 2007, 2013 సంవత్సరాల్లో జరిగిన ఎన్నికల్లో మజ్దూర్ యూనియన్ మొదటి స్థానంలో నిలిచింది. ఆ రెండుసార్లూ సంఘ్ రెండో స్థానంతో సరిపెట్టుకుంది. ఇప్పుడు జోనల్ వ్యాప్తంగా జరిగిన ఎన్నికల్లో గుంతకల్లు, నాందేడ్, గుంటూరు, హైదరాబాదు, సీఆర్ఎస్ తిరుపతి, లల్లాగూడ వర్క్‌షాపు ఎన్నికల్లో ఎంప్లాయీస్ సంఘ్ ఎక్కువ ఓట్లను సాధించగా, యూనియన్ రెండో స్థానంతో సరిపెట్టుకుంది. అలాగే జోన్ పరిధిలోని సికింద్రాబాద్, రైల్ నిలయం, విజయవాడ, రాయంపాడు స్టేషన్‌లో జరిగిన ఎన్నికల్లో సంఘ్‌పై యూనియన్ మెజారిటీని సాధించింది. మొత్తానికి సంఘ్ ఆరుచోట్ల గెలుపొందినా, నాలుగు చోట్ల విజయం సాధించిన మజ్దూర్ యూనియన్ 3,087 ఓట్లతో జోన్‌లో ఆధిపత్యాన్ని సాధించింది.

ఎన్నికల్లో చెరి సగం

జాతీయ స్థాయిలో జరిగిన రైల్వే ఉద్యోగ సంఘ గుర్తింపు ఎన్నికల్లో ఆలిండియా రైల్వేమెన్ ఫెడరేషన్ (ఏఐఆర్ఎఫ్), నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వేమెన్ (ఎన్ఎఫ్ఐఆర్) ఉద్యోగ సంఘ సమాఖ్యలు దాదాపు సమాన స్థాయిలో నిలిచాయి. ఈ రెండు ఉద్యోగ సమాఖ్యలకు అనుబంధంగా వివిధ డివిజన్లలో వివిధ పేర్లతో ఉన్న ఉద్యోగ సంఘాలు ఈ ఎన్నికల్లో పోటీపడ్డాయి. ఈ ఎన్నికల్లో మొత్తం ఓట్లలో 30 శాతం ఓట్లను సాధించిన సంఘాన్ని యాజమాన్యం గుర్తిస్తుంది. రెండు సంఘాలు 30 శాతాన్ని దాటి ఓట్లను సాధిస్తే రెండింటికీ యాజమాన్యం గుర్తింపును ఇస్తుంది. 30 శాతం ఓట్లు దాటినా ఎక్కువ ఓట్లను సాధించిన ఉద్యోగ సంఘాలు గెలుపు సాధించినట్లుగా భావిస్తాయి. ఈ మేరకు దేశంలో ఉన్న రైల్వే జోన్లు, మెట్రో రైల్వేలు కలిపి మొత్తం 19 చోట్ల జరిగిన ఎన్నికల్లో ఎన్ఎఫ్ఐఆర్ సమాఖ్య ఎనిమిది చోట్ల, ఏఐఆర్ఎఫ్ సమాఖ్య ఏడుచోట్ల తొలి స్థానాన్ని సాధించాయి. అలాగే ఎన్ఎఫ్ఐఆర్ సమాఖ్య 30 శాతం ఓట్లను సాధించినా ఏఐఆర్ఎఫ్ కంటే తక్కువ ఓట్లు రావడంతో ఐదుచోట్ల రెండో స్థానంలో నిలిచింది. ఎన్ఎఫ్ఐఆర్ ఆరుచోట్ల రెండో స్థానంలో నిలిచింది. ఆరుచోట్ల ఈ రెండు సమాఖ్యలకు 30 శాతం కంటే తక్కువ ఓట్లు రావడంతో ఆ చోట్ల ఈ రెండు సమాఖ్యలలో ఉన్న సంఘాలకు గుర్తింపు గల్లంతైంది.



పోరాటాలే గెలిపించాయి: ప్రభాకర్, సంఘ్ డివిజనల్ కార్యదర్శి

మాకు ఓటువేసి తొలిసారిగా పూర్తి ఆధిక్యాన్నిచ్చిన ఉద్యోగ ఓటర్లకు ధన్యవాదాలు తెలుపుతున్నాం. మేము గతంలో చేసిన పోరాటాలలో ఎక్కువ శాతం విజయాన్ని సాధించాము. ఓ రైల్వే ట్రాక్‌మన్ ఆత్మహత్య విషయంగా చేసిన పోరాటాలను గుర్తించి ఉద్యోగులు, కార్మికులు మా సంఘంపై నమ్మకాన్ని ఉంచి ఓట్లు వేశారు. ఇకపై కూడా ఫలప్రద పోరాటాలతో కార్మికులు, ఉద్యోగులకు మేలు చేయడానికి సర్వశక్తులను ఒడ్డుతాం.



నమ్మకాన్ని నిలుపుకుంటాం: మల్లికార్జున, సంఘ్ ఏడీఎస్

మాపై నమ్మకాన్ని ఉంచి ఓట్లు వేసిన ఉద్యోగులు, కార్మికులకు జవాబుదారీగా ఉంటాము. ప్రచారా ఆర్భాటాలు, పొద్దుపుచ్చే కార్యక్రమాలు కాకుండా, ఇబ్బందుల్లో ఉన్న ఉద్యోగులకు మేము అండగా నిలుస్తాం. ఈ ఆధిక్యాన్ని ఇలాగే నిలుపుకోవడానికి ప్రయత్నిస్తాం.

జగన్ హయాంలో రైతులకు అన్యాయం

మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు


మాట్లాడుతున్న ఎంఎస్ రాజు

అనంతపురం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల పాలనలో వైఎస్ జగన్ అన్నదాతలకు తీవ్ర అన్యాయం చేశారని మడకశిర ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు ఎంఎస్ రాజు మండిపడ్డారు. నగరంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. హంద్రీనీవాకు ఒక్క పైసా ఖర్చు పెట్టారా అని వైసీపీ నాయకులను నిలదీశారు. అపట్లో తమ నాయకుడు, సీఎం చంద్రబాబు హంద్రీనీవా పథకం కింద 31 పనులను మొదలుపెడితే.. వాటిని రద్దు చేసింది జగన్ ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. ఉమ్మడి జిల్లాకు చుక్కనీరు తీసుకురాని వారికి కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత లేదని అన్నారు. పెద్దిరెడ్డి పుంగనూరుకు నీరు తీసుకుపోతుంటే నోరు మెదపలేదని మండిపడ్డారు. చంద్రబాబు 90 శాతం రాయితీలతో డ్రిప్ పరికరాలు ఇచ్చారని, జగన్ నిర్వీర్యం చేసిందని అనానరు. ఉద్యాన రైతులకు ఎవరు అండగా ఉన్నారో చర్చకు సిద్ధమా అని వైసీపీ నాయకులకు సవాల్ విసిరారు. ధాన్యం కొనుగోలు చేసి రూ.1600 కోట్లు బకాయిలు పెడితే కూటమి ప్రభుత్వం చెల్లించిందని అన్నారు. జగన్ ప్రభుత్వంలో బతకలేనని పులివెందులలో చీనీ రైతు ఆత్మహత్య చేసుకున్నాడని, వైసీపీ ఐదేళ్ల పాలనలో 3 వేల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని అన్నారు. జగన్ తీరు తెలుసుకాబట్టే ధర్నాలకు రైతులు రాలేదని అన్నారు. కాలేజీ విద్యార్థులు, పార్టీ కార్యకర్తలు, నాయకులతో ధర్నా చేయించారని ఎద్దేవా చేశారు. రైతులకు రూ.7500 ఇచ్చి మిగిలిన పథకాలన్నీ రద్దు చేసిన దుర్మార్గుడు జగన్ అని మండిపడ్డారు. శింగనమల నియోజకవర్గంలో వడగండ్ల వానతో 5 వేల ఎకరాల్లో పంటనష్టపోయి రైతులకు రూపాయి కూడా పరిహారం ఇవ్వలేదని విమర్శించారు. అసైన్డ్ భూముల వ్యవహారం, సాగునీటి ప్రాజెక్టులు, మద్యపాన నిషేధం, అమ్మఒడి సహా అన్నింటిపై చర్చకు రావాలని సవాలు విసిరారు.

వైసీపీది దగాకోరుల దండయాత్ర

ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు


మాట్లాడుతున్న కాలవ

అనంతపురం అర్బన్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులది ప్రభుత్వంపై దగాకోరుల దండయాత్ర అని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు మండిపడ్డారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని నాశనం చేశారని, రైతులకు అన్యాయం చేశారని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే రైతులను దారుణంగా మోసగించారని అన్నారు. 2018లో పంట నష్టపోయిన జిల్లా రైతులకు రూ.930 కోట్లు పరిహారం ఇస్తామని అసెంబ్లీ సాక్షిగా హామీ ఇచ్చి, ఎగ్గొట్టిన మోసగాడు జగన్ అని విమర్శించారు. టీడీపీ హయాంలో 2014-19 సంవత్సరాల్లో మూడేళ్ల పరిహారం ఇచ్చామని అన్నారు. ఒకే సంవత్సరంలో రూ.1,471 కోట్ల పరిహారం ఇచ్చామని, ఇందులో కేవలం పంటనష్టపరిహారం రూ.1,032 కోట్లు ఉందని అన్నారు. జగన్ ఐదేళ్ల పాలనలో జిల్లాకు రూ.1,000 కోట్లు సాయం చేయగా, ఇందులో కేవలం రూ.113 కోట్లు పంట నష్టపరిహారం ఉందని, మిగతాదంతా బీమా అని అన్నారు. సాగునీటి ప్రాజెక్టులను పూర్తిగా నిలిపివేసి, జిల్లా భవిష్యత్తును నాశనం చేశారని అన్నారు. టీడీపీ హయాంలో రూ.1000 కోట్లతో హంద్రీనీవా పనులు ప్రారంభించామని, వైసీపీ అధికారంలోకి రాగానే ఆపేశారని విమర్శించారు. రూ.10వేల కోట్లతో అదనంగా 6300 క్యూసెక్కుల సామర్థ్యానికి పెంచుతానని జగన్ హామీ ఇచ్చి, నెరవేర్చలేదని అన్నారు. గత ఐదేళ్లలో మల్యాల - జీడిపల్లి తొలి దశ విస్తరణకు ఒక్క రూపాయి ఖర్చు పెట్టలేదని మండిపడ్డారు. అధికారంలో ఉండగా అన్యాయం చేసి.. ఇప్పుడు రైతుల మీద కపట ప్రేమను చూపిస్తున్నారని విమర్శించారు. వైసీపీ మోసగాళ్లు అందరూ కలెక్టరేట్ వద్ద మొసలికన్నీరు కార్చినట్లు ఉందని ఎద్దేవా చ ఏశారు. కూటమి ప్రభుత్వం నీటి ప్రాజెక్టుల పనులను మళ్లీ ప్రారంభిస్తోందని అన్నారు. రూ.36 కోట్లతో హెచ్చెల్సీ ఆధునికీకరణకు టెండర్లు ఆహ్వానించామని అన్నారు. ఫిబ్రవరిలో పనులు ప్రారంభం అవుతాయని అన్నారు. రైతుల సంక్షేమం కోసం పాటుపడుతున్న చంద్రబాబుతో చేతులు కలపాలని హితవు పలికారు.

రేపు రాయలసీమ మహా కవిసమ్మేళనం

రాయలసీమ సాంస్కృతిక వేదిక కన్వీనర్ డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి

అనంతపురం కల్చరల్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాయలసీమ మహా కవిసమ్మేళనాన్ని జయప్రదం చేయాలని రాయలసీమ సాంస్కృతిక వేదిక కన్వీనర్ డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని ఈ నెల 15న స్థానిక ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. మహాకవిసమ్మేళనం బ్రోచర్లను శుక్రవారం ఎస్ఎస్‌బీఎన్ కళాశాల ఆడిటోరియంలో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కవిసమ్మేళనంలో భాగంగా రాయలసీమ చిత్రలేఖనాల ప్రదర్శన, పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వివిధ ప్రాంతాలనుంచి హాజరయ్యే దాదాపు 140 మంది కవులు కవితాగానం చేస్తారన్నారు. కవిసమ్మేళనంలో అన్నివర్గాల ప్రజలు, మేధావులు, కవులు, కళాకారులు విరివిగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాయలసీమ సాంస్కృతిక వేదిక సభ్యులు రవికుమార్, నాగేశ్వారెడ్డి, వన్నూరుసాబ్, తమ్మారెడ్డి, వన్నూరుస్వామి పాల్గొన్నారు.


బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

చిత్తశుద్ధితో పనిచేద్దాం

కలెక్టరేట్‌లో అధికారుల ప్రతిజ్ఞ

అనంతపురంటౌన్, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధికి సీఎం చంద్రబాబునాయుడు శుక్రవారం స్వర్ణాంధ్ర విజన్-2047 డాక్యుమెంటరీని ఆవిష్కరించారు. ఈకార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో లైవ్ ప్రదర్శించారు. జేసీ శివనారాయణశర్మ ఆధ్వర్యంలో విజన్ స్వర్ణాంధ్ర-విజన్ అభివృద్ధికి ప్రతిఒక్కరు చిత్తశుద్ధితో పనిచేద్దాం అంటూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డీఆర్ఓ మలోల, డీపీఓ నాగరాజునాయుడు, డీఈఓ ప్రసాద్‌బాబు, హౌసింగ్ పీడీ శైలజ తదితరులు పాల్గొన్నారు.


ఇద్దరు నిందితులు, వాహనాలతో పోలీసులు

నగరంలో చోరీలు

ముగ్గురి అరెస్టు

అనంతపురం క్రైం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాలు, ఆలయాల్లో చోరీలకు పాల్పడుతున్న ముగ్గురిని నాలుగో పట్టణ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. సీఐ కనుమూరి సాయినాథ్ తెలిపిన మేరకు, అనంతపురం మారుతీనగర్ సమీపంలోని అయ్యప్పస్వామి ఆలయం వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న గుజ్జల అశోక్‌ను శుక్రవారం అదుపులోకి తీసుకుని విచారించారు. ఇతడిని శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలోని దుర్గానగర్ వాసిగా గుర్తించారు. ధర్మవరంలోని నాలుగబావికి చెందిన ఓ బాలుడితో కలిసి సెప్టెంబరులో అనంతపురం నగరంలోని లక్ష్మీనగర్‌లో ఓ బైక్ దొంగిలించాడు. నవంబరులో లెనిన్‌నగర్‌లో మరో బైక్ చోరీ చేశాడు. వారి నుంచి రెండు బైక్‌లు స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపరిచారు. చోరీలకు పాల్పడుతున్న ధర్మవరానికి చెందిన గుర్రంపాటి రాకేశ్ రణదీర్ ఎను నగరంలోని డీమార్ట్ సమీపంలో ఎస్ఐ అల్లాబకాష్ అరెస్టు చేశారు. అతడి నుంచి ఓ బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నరసింహులు అనే పాత నేరస్థుడితో కలిసి మారుతీనగర్‌లోని కోదండ రామాలయంలో హుండీ పగలకొట్టి చోరీ చేశాడు. నరసింహులు పరారీలో ఉన్నాడు. పట్టుబడినవారిలో బాలుడిని జువైనల్ కోర్టులో హాజరుపరిచారు.

ఆత్మహత్య కేసులో భర్త అరెస్టు

గార్లదిన్నె, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల గ్రామానికి చెందిన సుజాత ఆత్మహత్య కేసులో ఆమె భర్త సురేష్‌ను శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ మహమ్మద్‌గౌస్‌బాషా తెలిపారు. తన ఇద్దరు పిల్లలకు విషపు గుళికలు ఇచ్చి, సుజాత ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. వీరి కుమారుడు నాగచైతన్య మృతిచెందాడు. కూతురు పరిస్థితి విషమంగా ఉంది.

- గార్లదిన్నె మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతిపై అత్యాచారం కేసులో నిందితుడు సాకే వంశీని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ముగిసిన శిక్షణ

అనంతపురంరూరల్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వ్యాపార నిర్వహణ శక్తి సామర్థ్యాలపై ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు నిర్వహించిన మూడు రోజుల శిక్షణ శుక్రవారం ముగిసింది. స్థానిక స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో చివరి రోజు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహణ శక్తి సామర్థ్యాలు, వ్యాపారం చేసుకొనుటకు కావలసిన విధి విధానాలు, వ్యాపార అభివృద్ధి అంశాల గురించి ఐఎల్ఓ శిక్షకులు రాజ్యలక్ష్మి, రామాంజనేయులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగ యువతీ, యువకులు, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సిబ్బంది పాల్గొన్నారు. ఈనెల 17 నుంచి ఐదు రోజుల పాటు స్టార్ట్ యువర్ బిజినెస్‌పై ఉచిత శిక్షణ ఉంటుందని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. నిరుద్యోగ యువతీ యువకులకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 08554-281026, 8317520929 నెంబర్లను సంప్రదించాలన్నారు.

నేడు సాగునీటి సంఘాల ఎన్నికలు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నిలకు శనివారం పోలింగ్ నిర్వహించనున్నారు. ఎన్నికల పోలింగ్ నిర్వహణకు సంబంధించి అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు హెచ్చెల్సీ పరిధిలో 99, మైనర్ ఇరిగేషన్ పరిధిలో 95 మొత్తం 194సాగునీటి సంఘాల నిర్వహణకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లాల పరిధిలోని ఆయా ప్రాజెక్టులు, ఆయా డిస్ట్రిబ్యూటరీల పరిధిలో సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న 194సాగునీటి సంఘాల ఎన్నిక, సర్వసభ్యసమావేశాలు మొత్తం శనివారమే నిర్వహించనున్నారు. 17న జిల్లాలోని హెచ్ఎల్ఎంసీ, మిడ్ పెన్నార్ సౌత్‌కెనాల్, మిడ్ పెన్నార్ నార్త్ కెనాల్, తాడిపత్రి బ్రాంచ్ కెనాల్, గుంతకల్లు బ్రాంచ్‌కెనాల్, ఆలూరు బ్రాంచ్ కెనాల్‌తో పాటు డిస్ట్రిబ్యూటరీల కమిటీలను ఎన్నుకుంటారు. అదేరోజు తుంగభద్ర, భైరవానితిప్ప ప్రాజెక్ట్, మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టుల కమిటీలను ఎన్నుకోనున్నారు. ఆయకట్టు రైతులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

న్యూస్ బాక్స్

జనన, మరణ పత్రాలు త్వరగా అందించేందుకు చర్యలు

● ఆస్పత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు



నూతన కంప్యూటర్లను పరిశీలిస్తున్న సూపరింటెండెంట్

అనంతపురం టౌన్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): జనన, మరణ ధ్రువీకరణ పత్రాల కోసం ఆస్పత్రికి వచ్చే వారికి త్వరగా అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు తెలిపారు. ఆ విభాగంలో కంప్యూటర్ల సమస్య ఉండడంతో కొత్తగా రెండు సిస్టంలను కొనుగోలు చేసి శుక్రవారం ఏర్పాటు చేయించారు. వాటిని సూపరింటెండెంట్ తోపాటు ఆర్ఎంఓ డాక్టరు హేమలత పరిశీలించారు. సూపరింటెండెంట్ మాట్లాడుతూ పెద్దసంఖ్యలో జనన, మరణ ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తులు వస్తున్నాయన్నారు. అక్టోబరు, నవంబరు, డిసెంబరు వరకు 5,005 దరఖాస్తులు రాగా ఇందులో 4,895 మంజూరు చేశామన్నారు. మరణ ధ్రువీకరణ పత్రాలకు 685 దరఖాస్తులు రాగా 645 మంజూరు చేయించామన్నారు. ప్రస్తుతం కొత్తకంప్యూటర్లు ఏర్పాటు చేయడంతో పత్రాల జారీ వేగవంతంగా చేసేందుకు వీలుంటుందన్నారు.

చదువుపై ధ్యాసపెడితేనే భవిష్యత్తు: సీఐ

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): యుక్త వయసులో చదువుపై ధ్యాపెడితేనే భవిష్యత్తు బాగుంటుందని, దురలవాట్లకు చోటుకల్పిస్తే జీవితాలు నాశనం అవుతాయని ఎస్కేయూ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు ఇటుకలపల్లి ఎస్ఐ విజయకుమార్ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ కళాశాల హాస్టల్‌లో కొందరు విద్యార్థులు గురువారం రాత్రి మద్యం సేవించి పెద్దశబ్దంతో పాటలు పెట్టుకున్నారని తెలిపారు. తోటి విద్యార్థులు గమనించి నివారించేందుకు ప్రయత్నంచేశారని పేర్కొన్నారు. విద్యార్థులు గుంపుగాచేరి ఒకరికొకరు తోసుకున్నారన్నారు. మద్యం సేవించిన విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించి వారి తల్లిదండ్రులకు తెలిపామన్నారు. ఇకపై ఇలాంటివాటికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

కనగానపల్లి, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూంచెర్ల వాసుల కళ నెరవేరబోతోంది. ఎమ్మెల్యే పరిటాల సునీత ఎన్నికల ప్రచారంలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు రంగంపేట నుంచి తూంచెర్ల మీదుగా తగరకుంట వరకూ తారు రోడ్డు నిర్మాణానికి నిధులు మం జూరు చేశారు. టీడీపీ మండల కన్వీనర్ యాతం పోతులయ్య గ్రామస్థులతో కలిసి శుక్రవారం భూమిపూజ చేసి రోడ్డు పను లు ప్రారంభించారు. మాజీ ఎంపీటీసీ ఆదెప్ప, యాతం మల్లికార్జున, శ్రీరాములు, జయశంకర్, బోర్ల చిన్నప్ప, బంగి మల్లేష్, రామకృష్ణ, చెంద్రాయుడు, నరసప్ప, బాలశివ పాల్గొన్నారు.

తల్లి, కుమారుడి మృతికి ఎమ్మెల్యే నివాళి



మృతదేహాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

గార్లదిన్నె, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కుటుంబ కలహాలతో గురువారం ఇద్దరు పిల్లలకు విషమిచ్చి తల్లి ఆత్మహత్యాయత్నం చేసిన ఘటనలో తల్లి సుజాత, కుమారుడు నాగచైతన్య మృతిచెందిన విషయం తెలిసిందే. శుక్రవారం ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికిలోని తల్లి, కొడుకుల మృతదేహాలను పరిశీలించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. తల్లి, కుమారుడి మృతదేహాలను స్వగ్రామానికి తీసుకెళ్లగానే బంధువులు, గ్రామస్థులు కన్నీరుమున్నీరయ్యారు. అనంతరం అంత్రక్రియలు నిర్వహించారు.

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీకి సన్మానం



ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీకి జ్ఞాపికను ఇస్తున్న ఎంపీఈఓలు

అనంతపురం అర్బన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీని వ్యవసాయ శాఖ ఎంపీఈఓల సంఘం రాయలసీమ జోన్ అధ్యక్షుడు రెడ్డి ప్రసాద్, పలువురు నాయకులు సన్మానించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఓడీపై పనిచేస్తున్న తమ సమస్యలపై స్పందించి రాష్ట్ర ఉన్నతాధికారులతో చర్చించి, తిరిగి జిల్లాకు రప్పించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం అనంతపురం నగరంలోని ఆమె నివాసంలో ఎమ్మెల్యేను కలిసి శాలువకప్పి సన్మానించారు. ఎంపీఈఓల సంఘం నాయకులు భాస్కర్‌నాయక్, అశోక్, వంశీ, నాగశేషు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అనంతపురంరూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పవర్ హౌస్‌లో ఉన్న సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్‌లో భాగంగా పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ శాఖ డీ-1సెక్షన్ ఏఈఈ నీలకంఠం తెలిపారు. ఉదయం 8:30 నుంచి 11గంటల వరకు సంగమేష్ సర్కిల్, అశోక్‌నగర్, నేతాజీ పార్కు, సెంట్రల్ ఎక్సైజ్ కాలనీ, బోయవీధి, 80 అడుగుల రోడ్డు, వైఎస్సార్ కాలనీ, మరువకొమ్మకాలనీ, అనంతసాగర్ కాలనీ, గాంధీబజార్ మొయిన్‌రోడ్డు, తాడిపత్రి బస్టాండు, రాణీనగర్, నీరుగంటి వీధి, తిలక్‌రోడ్డు, మున్నానగర్, కేవీఎస్‌నగర్, దక్షిణామూర్తినగర్, వీరభద్రకాలనీ, ములసమ్మకట్ట, అంబరపువీధి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమద్ వ్రతం

అనంతపురం కల్చరల్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మార్గశిర శుద్ధ త్రయోదశిని పురస్కరించుకుని శుక్రవారం హౌసింగ్‌బోర్డులోని భక్తాంజనేయస్వామి దేవాలయంలో హనుమద్ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారి మూలవిరాట్టుకు పంచామృతాభిషేకాలు నిర్వహించడంతోపాటు ఉత్సవమూర్తికి భక్తుల చేతులమీదుగా క్షీరాభిషేకం నిర్వహించారు.

శింగనమల చెరువుకు తీవ్ర పోటీ..?

● నేటి సాగునీటి సంఘాల ఎన్నికలకు సర్వం సిద్ధం

● కూటమి నేతల వద్దకు ఆశావహుల చక్కర్లు

శింగనమల, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): శింగనమల చెరువు నీటి సంఘానికి తీవ్ర పోటీ నెలకొంది. కూటమి నేతల మధ్య సమన్వయం కుదిరినా ఇండిపెండెంట్లతో సమస్యగా మారింది. వారితో కూటమి నాయకులు చర్చలు జరిపి ఏకగ్రం చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. కూటమి నేతల వద్ద ఆశావహులు చక్కర్లు కొడుతున్నారు.

ఎన్నికలు నిర్వహిస్తారిలా...

శనివారం ఉదయం 8 గంటలకు ఎన్నికల జరిగే ప్రదేశానికి నీటి సంఘంలో ఓట్లు ఉన్న రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఓటరు లేదా ఆధార్‌కార్డు తీసుకురావాల్సి ఉంటుంది. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు రైతుల నుంచి వివరాలు సేకరిస్తారు. ఎన్నికలకు కేటాయించిన గదులలో వారిని సమావేశపరుస్తారు. 9 నుంచి 9.45 గంటల వరకు ఏకభాప్రాయం ద్వారా ఎంపిక చేసేందుకు అవకాశం కల్పిస్తారు. లేనిపక్షంలో ఓటింగ్ ద్వారా టీసీ మెంబర్లను ఎన్నుకుంటారు. మధ్యాహ్నం 3 నుంచి ఎంపికైన ఆరుగురు టీసీ మెంబర్లలో ఒకరిని ప్రెసిడెంట్ మరోకరిని వైస్ ప్రెసిడెంట్‌గా ఎంపిక చేసుకుంటారు. దీంతో ఎన్నికల ప్రక్రియ ముగుస్తుంది..

తీవ్రపోటీ?

శింగనమల చెరువు ఆయకట్టు కింద ఆరు టీసీ మెంబర్ల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ఇప్పటికే వైసీపీ ఎన్నికలు బహిష్కరించడంతో మండలంలోని మిడ్‌పెన్నార్ ఐదో దక్షిణ కాలువ కింద రెండు టీసీలు ఇప్పటికే కూటమి పార్టీలు ఒకరిని ప్రెసిండెంట్‌గా నియమించాలని ఏకభాప్రాయంతో ఉన్నట్లు తెలిసింది. శింగనమల చెరువు కింద ఆరు డీసీలకు పోటీ ఉండే అవకాశం ఉంది. వైసీపీ పోటీలో లేదు. కూటమి అభ్యర్థికి ఇక్కడ ఇండిపెండెంట్ అభ్యర్థుల నుంచి పోటీ ఉన్నట్లు తెలుస్తోంది. కూటమి అభ్యర్థులు ఏకప్రాయం కోసం ప్రయత్నాలు చేస్తునట్లు సమాచారం.

సజావుగా ఎన్నికలు నిర్వహించాలి

సజావుగా సాగునీటి సంఘం ఎన్నికలు నిర్వహించాలని తహసీల్దార్ సాకే బ్రహ్మ, ఇరిగేషన్ డీఈ సురేంద్ర సూచించారు. మండలంలోని శింగనమల, సలకంచెరువు చెరువులకు, మిడ్‌పెన్నార్ దక్షిణ కాలువ కింద రెండు సాగునీటి సంఘాలకు శనివారం ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా సాగునీటి ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై పలు శాఖల అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు.



మాట్లాడుతున్న తహసీల్దార్

కష్టపడి చదివితే ఉన్నత జీవితం



విద్యార్థినికి ప్రోత్సాహక బహుమతి అందిస్తున్న బద్రీనాథ్

అనంతపురం విద్య, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివితే ఉన్నత జీవితం సొంతం చేసుకోవచ్చని డీన్ బద్రీనాథ్ అన్నారు. శుక్రవారం నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో నారాయణ జూనియర్ కళాశాల సాయినగర్ బ్రాంచ్ 10వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కోర్ డీన్ బద్రీనాథ్, డీజీఎం వెంకటరామిరెడ్డి, ఇతర ప్రిన్సిపాళ్లు హాజరయ్యారు. గతంలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.10 వేల ప్రోత్సాహక నగదు, జ్ఞాపికలను డీన్ అందించి అభినందించారు. ప్రిన్సిపాల్ శ్రీధర్‌బాబు, ఏజీఎం చెన్నకేశవులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజన్-2047తో పేదరికం లేని సమాజం

అనంతపురం అర్బన్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): విజన్-2047 అమలుతో పేదరికం లేని సమాజాన్ని చూడవచ్చని పంచాయితీరాజ్ చాంబర్ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి డేగల కృష్ణమూర్తి, ఉమ్మడి అనంత జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు గొనుగుంట్ల భూషణ్ ప్రకటనలో పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు దూరదృష్టికి విజన్-2047 అమలు చేయడమే నిదర్శనమన్నారు. ఇలాంటి సమయంలో గత ఐదేళ్లు అన్ని వర్గాలను మోసం చేసిన వైసీపీ నాయకులు సిగ్గులేకుండా రైతులకు న్యాయం చేయాలంటూ కపట ప్రేమతో కలెక్టరేట్ల వద్ద నిరసనలు చేపట్టడం దారుణమన్నారు.

అయ్యప్పస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే



శబరిమలలో అనుచరులతో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

అనంతపురం అర్బన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): శబరిమల అయ్యప్పస్వామిని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ దర్శించుకున్నారు. 41 రోజుల దీక్ష అనంతరం తన అనుచరులతో కలిసి శుక్రవారం శబరిమలకు ఎమ్మెల్యే చేరుకున్నారు. బంగారు మెట్లను ఎక్కి స్వామివారికి ఇరుముడి సమర్పించారు. అనంతరం ఆలయ ప్రధాన తంత్రిని ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేను ప్రధాన తంత్రి ఆశీర్వదించారు. తనకు అయ్యప్పస్వామి అంటే ఎంతో భక్తి అని, 24వ సారి అయ్యప్పమాల ధరించినట్లు చెప్పుకొచ్చారు.

అంబేడ్కర్‌ను అవమానించిన వైసీపీ

● కేసు నమోదు చేసి శిక్షించాలి

● ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్న ఆంజనేయులు



ఆందోళన చేస్తున్న చిన్న ఆంజనేయులను అడ్డుకుంటున్న పోలీసులు

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్‌ను అవమానించిన వైసీపీ నాయకులపై కేసు నమోదు చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్న ఆంజనేయులు డిమాండ్ చేశారు. రైతు పోరు పేరుతో వైసీపీ కలెక్టరేట్‌కు ర్యాలీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించింది. ర్యాలీలో భాగంగా వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంట్రామిరెడ్డి ఆ పార్టీ నాయకులతో కలిసి జడ్పీవద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కాళ్లకు చెప్పులతోనే మెట్లెక్కి వెళ్లి అంబేడ్కర్ విగ్రహానికి ఎలా నివాళులర్పిస్తారని ఆంజనేయులు ప్రశ్నించారు. రాజ్యాంగ నిర్మాతను వైసీపీ నాయకులు అవమానించారని ఆందోళనకు దిగారు. గమనించిన పోలీసులు ఆయన్ను అడ్డుకుని అక్కడినుంచి తరలించారు. ఈ సందర్భంగా చిన్న ఆంజనేయులు మాట్లాడుతూ.. వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డికి అంబేడ్కర్‌పై గౌరవం లేదన్నారు. ఆయన బాటలోనే ఆ పార్టీ నాయకులు వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు.

నియామకాల్లో సామాజిక న్యాయం పాటించాలి

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్రశిక్ష సెక్టోరియల్ పోస్టుల భర్తీలో సామాజిక న్యాయం పాటించాలని ఆర్ఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రామచంద్ర, వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎండీ నాగభూషణం ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శుక్రవారం జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ శర్మను కలిసి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ ఎంపిక ప్రక్రియలో ఉన్నతాధికారులు దృష్టిపెట్టకపోవడంతో అక్రమాలు జరుగుతున్నాయన్నారు. అస్మదీయులను నియమిస్తూ జారీచేసిన జాబితాను రద్దుచేయకపోతే పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ముత్యాలరాజు, రామకృష్ణ, మల్లేష్ పాల్గొన్నారు.

ఒంగోలు గిత్తలను పోషించే రైతులను ప్రోత్సహించాలి

ఆత్మకూరు డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఒంగోలు గిత్తలను పో షించే రైతులను ప్రోత్సహించాలని ఎస్ఐ లక్ష్మీనారాయణ కోరారు. శు క్రవారం మనగ్రోమోర్ కంపెనీ నిర్వాహకులు ఒంగోలు గిత్తల బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ పశుపోషణపై రై తులు ఆసక్తి చూపాలన్నారు. అనంతరం గెలుపొందిన ఎద్దుల యజమానులకు కంపెనీ ప్రతినిధులు జడ్ఎంఎం చక్రధర్, ఏఎంఆర్ఓ నాయుడు, ఆర్పీసీ తిరుపతయ్య చేతులు మీదుగా ప్రోత్సాహక బహుమతులను అం దించారు. కార్యక్రమంలో మన గ్రోమోర్ మేనేజర్ మహానంది పాల్గొన్నారు.

ఇసుక మాఫియాకు అడ్డేలేదా?

● సర్వసభ్య సమావేశంలో సర్పంచ్ ఆగ్రహం

శింగనమల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇసుక మాఫియాకు అడ్డూ అదుపులేకుండా పోయిందని ఓ సర్పంచ్ మండల సర్వసభ్య సమావేశంలో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్యసమావేశం ఎంపీపీ యోగేశ్వరి అధ్యక్షతన నిర్వహించారు. జూలాకాలువ సర్పంచ్ రాజారెడ్డి మాట్లాడుతూ కూతలేరు, జూలాకాలువ, పెద్ద జలాలపురం వంకల్లో ప్రజల అవసరాలకు ప్రభుత్వం ఉచిత విధానాన్ని ప్రవేశపెట్టినా ఇసుక మాఫియా వారు టిప్పర్లతో జిల్లా కేంద్రానికి, నార్పల తాడిపత్రి తదితర ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తున్నారని మండిపడ్డారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. స్పందించిన తహసీల్దార్ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఇసుక అక్రమ రవాణాను అరికడతామన్నారు. సమావేశంలో ఎంపీపీతోపాటు ప్రజాప్రతినిధులు ప్రభుత్వ కార్యాక్రమంలో అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదన్నారు. ఎంపీడీఓ మాట్లాడుతూ సమావేశాల సమయంలో అధికారులు తప్పక ప్రొటోకాల్ పాటించాలన్నారు. తహసీల్దార్ బ్రహ్మయ్య, ఎంపీడీఓ నిర్మలా కూమారి, సీడీపీఓ ఉమాశంకరమ్మ, ఏఓ అన్వేష్, ఎంఈఓ నరసింహరాజు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్ రాజారెడ్డి

రైతాంగాన్ని ఆదుకోండి

● జేసీకి వైసీపీ నేతల వినతి

అనంతపురం క్రైం,డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతాంగ సమస్యలను పరిష్కరించాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంతవెంకటరామిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. అన్నదాతలకు అండగా వైసీపీ నినాదంతో శుక్రవారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. ముందుగా జడ్పీ కార్యాలయం ఎదురుగా ఉన్న అంబేడ్కర్, వైఎస్ఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జిల్లా అధ్యక్షుడు అనంతవెంకటరామిరెడ్డి, నియోజకవర్గాల సమన్వయకర్తలు విశ్వేశ్వరరెడ్డి, తలారి రంగయ్య, మెట్టుగోవిందరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, వీరాంజనేయులు, ఎమ్మెల్సీలు శివరామిరెడ్డి, మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, మేయర్ మహమ్మద్ వసీం ప్రజాప్రతినిధులు పార్టీ శ్రేణులతో ర్యాలీగా వచ్చారు. అనంతరం జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మకు వినతిపత్రం అందజేశారు.

నేతల డుమ్మా: వైసీపీ అధినేత జగన్ పిలుపునిచ్చినా కొందరు వైసీపీ నాయకులు కలెక్టరేట్ ర్యాలీకి డుమ్మాకొట్టారు. శింగనమల మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ మాజీ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి హాజరు కాలేదు. ఇక ర్యాలీకి వైసీపీ శ్రేణులను తరలించే విషయంలో కొందరు చూరవచూపలేదని తెలుస్తోంది. ఉరవకొండ, కళ్యాణదుర్గం, శింగనమల, గుంతకల్లు నియోజకవర్గాల నాయకులు విఫలమైనట్లు పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. ఆయా నియోజకవర్గాల పరిధిలో కొన్ని మండలాల నుంచే పార్టీకేడర్ వచ్చినట్లు తెలిసింది.



జేసీకి వినతిపత్రం అందజేస్తున్న వైసీపీ నేతలు

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

అనంతపురం న్యూటౌన్, డిసెంబరు13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. తనిఖీలో ఏఎస్పీ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వైబీపీటీఏ ప్రసాద్, డీఎస్పీ నాగభూషణం పాల్గొన్నారు. రాప్తాడు లోని అవేజ్ (అవంతి) ఎరువుల గోడౌన్, గుత్తిరోడ్డులోని గ్రీన్ గ్రో న్యూట్రియెంట్ డిస్ట్రిబ్యూటర్, పీఆర్ ఆగ్రో న్యూట్రి ప్రైవేట్ లిమిటెడ్, ఆర్టీసీ బస్టాండ్ రోడ్డులోని శ్రీలక్ష్మీ గ్రేడింగ్ కార్పొరేషన్ (ఫెర్టిలైజర్స్) తనిఖీలు చేశారు. తూకాల్లో తేడాలు, రికార్డులకు ఉన్న స్టాకును పరిశీలించగా అందులో వ్యత్యాసాలు, తయారీదారి వివరాలు సరిగా ముద్రించకపోవడం లాంటి లోపాలను గుర్తించినట్లు ప్రసాద్, నాగభూషణం వెల్లడించారు. తూకాల్లో తేడాలు ఉండటంతో లీగల్ మెట్రాలజీ చట్టం ప్రకారం ఆశాఖ ఇన్‌స్పెక్టర్ ద్వారా రూ.లక్ష అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు. రికార్డుల్లో స్టాకులో వ్యత్యాసాల కారణంగా వ్యవసాయ అధికారుల ద్వారా 12.37 మెట్రిక్ టన్నుల ఎరువులకు సంబంధించి స్టాప్ సేల్ నోటీసులు జారీ చేయించామన్నారు. సీఐలు శ్రీనివాసులు, జమాల్‌బాషా, వ్యవసాయాధికారులు వాసు ప్రకాష్, శశికళ, డీసీటీఓలు విజయలక్ష్మి, సురేష్‌కుమార్, తూనీకలు కొలతల ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ గౌస్ పాల్గొన్నారు.



తనిఖీ చేస్తున్న అడిషనల్ ఎస్పీ ప్రసాద్

ఏపీ నంబర్ వన్‌గా నిలుస్తుంది

● రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్



పోస్టర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్

అనంతపురం అర్బన్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో ఏపీ నెంబర్ వన్‌గా నిలుస్తుందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం టీ డీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. శుక్రవారం నగరంలోని వారి నివాసంలో స్వర్ణాం ధ్ర విజన్-2047 పోస్టర్లను వారు విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సీఎం చంద్రబాబుకు ఉన్నంత దూరదృష్టి మరెవరికీ లేదన్నారు. 2047 నాటికి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలిపేలా స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్ ఉందన్నారు. అంతలోపే రాష్ట్రం నెంబర్1గా మారుతుందన్న నమ్మకం తమకుందన్నారు. గత వైసీపీ పాలనలో రాష్ట్రం అన్నివిధాలుగా వెనుకబడిందన్నారు. చంద్రబాబు సీఎంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత నాశమైన వ్యవస్థలను గాడిలో పెడుతున్నారన్నారు. అందరికీ ఆరోగ్యం, సంపద, సంతోషం లక్ష్యంగా స్వర్ణాంధ్ర విజన్ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. మిగిలిన రాష్ట్రాలకు ఈ విజన్ మార్గదర్శకంగా ఉంటుందన్నారు.

విద్యార్థుల అవసరాలకు రూ.లక్ష వినియోగించండి

రామగిరి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యార్థుల అవసరాల కోసం పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్టు ద్వారా ఇచ్చిన రూ.లక్ష చెక్కును సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పరిటాలసునీత సూచించారు. అనంతపురంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం కుంటిమద్ది ఉన్నతపాఠశాల హెచ్ఎం అనంత పద్మనాభకు ఈ చెక్కును అందించారు. వెయిట్ లిఫ్టింగ్‌లో జాతీయస్థాయికి ఎంపికైన అలేఖ్యకు, హాకీలో సాత్విక్‌కు చెరో రూ.10వేలు చెక్కులను అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపట్ల మొగ్గుచూపేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. టీడీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కుంటిమద్ది రంగయ్య, మండల ప్రధానకార్యదర్శి మారుతీప్రసాద్, తెలుగుయువత అధ్యక్షుడు శ్రీధర్‌నాయుడు, రఘురాం, ఆనంద్ పాల్గొన్నారు.

కనీస సౌకర్యాలు కల్పించండి: సీపీఐ



ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

అనంతపురంరూరల్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోములదొడ్డి గ్రామ సమీపంలో ఉన్న నవయుగ కాలనీలో కనీస సౌకర్యాలు కల్పించాలని సీపీఐ నాయకులు కోరారు. అనంతపురం అరవిందనగర్‌లోని ఎమ్మెల్యే పరిటాల సునీత క్యాంపు కార్యాలయంలో ఆమెను కలసి నాయకులు వినతిపత్రం ఇచ్చారు. కాలనీలో 180మంది పేద ప్రజలు ఏడేళ్లనుంచి నివాసముంటున్నారన్నారు. గతంలో అక్కడున్న పెద్ద రాళ్లను తొలగించి, చదును చేసుకుని ఒక్కొక్కరు సెంటు స్థలంలో రేకుల షెడ్లు ఏర్పాటు చేసుకొని నివాసముంటున్నారన్నారు. వీరికి కనీస మౌలిక సదుపాయలు కల్పించాలన్నారు. ప్రజలకు ఇళ్లపట్టాలు మంజూరు చేయాలన్నారు. హౌసింగ్ ద్వారా ఇళ్లు నిర్మించాలని కోరారు. సీపీఐ నగర కార్యదర్శి శ్రీరాములు, సహాయ కార్యదర్శులు అల్లీపీర, రమణ, బంగారు బాషా, జయలక్ష్మి, నారాయణస్వామి, శీన, జిలాన్, రాజు పాల్గొన్నారు.

కలెక్టరేట్ అధికారుల్లో చలనం

● రెవెన్యూ సదస్సుల వివరాలు వెల్లడి

● 5రోజులు... 111 సదస్సులు.. 12,355 ఫిర్యాదులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతపురం టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ అధికారుల్లో చలనం వచ్చింది. రెవెన్యూ సదస్సులపై అధికారుల్లో చిత్తశుద్ధి ఏదీ అన్న కథనం ఆంధ్రజ్యోతిలో శుక్రవారం ప్రచురితమైంది. దీనిపై కలెక్టర్, జేసీ సీరియస్‌గా స్పందించారు. రోజువారీ సమాచారం ఎందుకు ఇవ్వడంలేదని వారు ప్రశ్నించినట్లు తెలిసింది. డీఆర్ఓ ఇతర సెక్షన్ ఆఫీసర్లు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రెవెన్యూ సదస్సుల సమాచారాన్ని నేరుగా మీడియాకు వివరించారు.

● 111 సదస్సులు.. 12,355 ఫిర్యాదులు

జిల్లాలో 6వ తేదీ నుంచి రెవెన్యూ సదస్సులు ప్రారంభమయ్యాయి. 5 రోజులుపాటు సభలు నిర్వహించారు. శుక్రవారం వరకు 12,355 ఫిర్యాదులు అందినట్లు అధికారులు వెల్లడించారు. అనంతపురం రెవెన్యూ డివిజన్‌లో 40 సదస్సులు నిర్వహించగా 3,671 ఫిర్యాదులు, 43 సదస్సులకు గాను 6,144 ఫిర్యాదులు, గుంతకల్లు రెవెన్యూ డివిజన్‌లో 28 సదస్సులు నిర్వహించగా 2,540 ఫిర్యాదులు అందినట్లు కలెక్టరేట్ అధికారులు తెలిపారు. ఇందులో 1,175 ఫిర్యాదులు సభలోనే పరిష్కరించినట్లు తెలిపారు.

జిల్లాస్థాయి ఆర్చరీ జట్టు ఎంపిక




ఎంపికైన క్రీడాకారులతో కోచ్‌లు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి ఆర్చరీ సబ్‌జూనియర్స్ క్రీడాకారులను ఎంపిక చేశారు. శుక్రవారం స్థానిక టీవీ టవర్ సమీపంలో ఉన్న గ్లోబల్‌స్కూల్‌లో జిల్లాస్థాయి ఆర్చరీ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారుల వివరాలను ఆర్చరీ అసోసియేషన్ కార్యదర్శి శివకుమార్ వెల్లడించారు. బాలురలో యజ్ఞరూప్ యాదవ్, గురువర్దన్, కీర్తన్ సాయి, అయాన్, పవన్, జతిన్, యోగేశ్వర్‌రెడ్డి, సంతోష్, మహ్మద్‌బాషా, ప్రజ్వల్, సాయిస్వరాగ్, యశస్విన్‌తేజ్, వెంకటరెడ్డి ఎంపికయ్యారు. బాలికల విభాగంలో మాన్విత, జస్మిత, తరుణిక, రక్ష, వందన, షన్ముకసాయి ప్రియ, చేతన్‌శ్రీలేఖ, గుణశ్రీ ఎంపికయ్యారు. ఎంపికైన వారు 23వతేదీ నుంచి రాజమండ్రిలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు.

జీఓ 145ను రద్దుచేయాలి

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఎన్‌డీపీఎస్ కోర్టును తరలించాలన్న ఉద్దేశంతో జారీచేసిన జీఓ 145ను రద్దుచేయాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకేహరి డిమాండ్ చేశారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు శుక్రవారం ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని కోర్టును సుదూర ప్రాంతానికి తరలిస్తే విచారణ వ్యవహారాలకు కష్టతరమౌతుందన్నారు. న్యాయవాదుల డిమాండ్‌లను పరిగణలోకి తీసుకుని పరిష్కరించాలని కోరారు.

కష్టపడే గుణాన్ని అలవర్చుకోవాలి



విద్యార్థినికి ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న విద్యాసంస్థల చైర్మన్ పల్లె కిశోర్

అనంతపురంరూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే కష్టపడే గుణాన్ని అలవర్చుకోవాలని నగర డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పీవీకేకేఐటీ డిప్లొమో కళాశాలలో ఫ్రెషర్ డేను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి విజయభాస్కర్‌రెడ్డి, శ్రీబాలాజీ విద్యాసంస్థల చైర్మన్ పల్లె కిశోర్ హాజరై మాట్లాడారు. వారు మాట్లాడుతూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్వాతంత్ర్య అమరవీరులే మన నిజమైన హీరోలన్నారు. పరీక్ష ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేయడంతోపాటు వారి తల్లిదండ్రులను సత్కరించారు. కళాశాల యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, ప్రిన్సిపాళ్లు బండి రమేష్‌బాబు, వైభవ్, వైస్ ప్రిన్సిపాల్ దీప్తి జోర్డాన్, ఏఓ మనోహరరెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా..

ఘనంగా ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ


హోమాలు నిర్వహిస్తున్న వేదపండితులు

కూడేరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కమ్మూరు గ్రామంలో శాస్త్రోక్తంగా గ్రామ దేవత ముత్యాలమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. శుక్రవారం ఆలయ ఆవరణంలో వేద పండితుల మంత్రాల నడుమ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. పూర్వకాలం నాటి ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో గ్రామస్థుల కలిసి కట్టుగా ఆలయాన్ని జీర్ణోద్ధరణ చేసి అమ్మవారిని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు

యాడికి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): భూ సమస్యల తక్షణ పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని చందన గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ప్రజల నుంచి వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ దరఖాస్తులను స్వీకరించారు. సదస్సులో మొత్తం 23దరఖాస్తులు వచ్చినట్లు ఆయన తెలిపారు.

సమావేశాన్ని విజయవంతం చేయండి

కణేకల్లు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఈ నెల 15న కడపలో జరిగే జమియత్ ఉలుమా ఏ హింద్ ఆధ్వర్యంలో జరిగే ముస్లింల బహిరంగసభను విజయవంతం చేయాలని ఉమ్మడి జిల్లా ఆ సంస్థ సభ్యులు ముఫ్తీఅబ్దుల్ సాహెబ్ కోరారు. శుక్రవారం బహిరంగసభకు సంబంధించి కణేకల్లులో పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో హుస్సేన్‌సాబ్, రఫీక్, హాఫీ సాబ్, బషీర్, అబుబక్కర్, ఇస్మాయిల్, ఖాసీం పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుంతకల్లు టౌన్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని మార్కెట్ యార్డు, ఇండస్ట్రియల్ ఏరియా సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈఈ నాగేంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన తెలిపారు.

తాడిపత్రి : మండలంలోని ఇండస్ట్రీయ్ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా శనివారం చిన్నపొలమడ, పెద్దపొలమడ గ్రామాలతోపాటు వాంబేకాలనీలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

ఉరవకొండ, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతపేటలోని 13, 22 అంగన్‌వాడీ కేంద్రాలను సీడీపీవో శ్రీదేవి పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో గర్భిణీలు, బాలంతలకు పౌష్టికాహారం గురించి అవగాహన కల్పించారు. ఆకు కూరలు, కూరగాయాలు, పండ్లు వంటి పౌష్టికాహారాలను తీసుకోవాలన్నారు. బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను తెలియజేశారు.

రేపటిలోగా పంటల బీమా చెల్లించండి

పుట్లూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలో రబీలో సాగుచేసిన పప్పుశనగ, వేరుశనగ, మొక్కజొన్న, జొన్న తదితర పంటలకు ఈనెల 15లోగా బీమా చెల్లించాలని శుక్రవారం మండల వ్యవసాయ అధికారి కాత్యాయిని తెలిపారు. బీమాను ఆన్‌లైన్‌లో చెల్లించుకోవాలని కోరారు. పంట బీమా చేసుకోకపోతే విపత్తులతో పంటలు నష్టపోతే బీమా వర్తించదని తెలిపారు.

పొదుపు సంఘంలో రూ.37వేలు మాయం

పుట్లూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని కడవకల్లు గ్రామంలో ఓ స్వయం సహాయక పొదుపు సంఘంలో రూ.37వేలు మాయమైనట్లు సమాచారం. వీటిపై గ్రామంలోని పలువురు మహిళా సభ్యురాళ్లు తమకు ఇవ్వలేదని ఒకరిపై ఒకరు వేసుకుంటూ వాగ్వాదానికి దిగినట్లు తెలుస్తోంది. ఉన్నతి పథకంలో భాగంగా వడ్డీలేని రుణం కింద సంఘంలోని ఓ సభ్యురాలికి రూ.75వేలు మంజూరు కాగా ఇందులో రూ.38వేలు జమకాగా మిగిలిన సొమ్ము తమకు ఇవ్వలేదు అంటూ సంఘంలోని సభ్యురాళ్లు వాదనకు దిగారు. ఈ రుణం సీసీ, వీఓ లీడర్‌లు సంఘంలోని సభ్యుల పేరుతో తీసుకొని వాడుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయంపై ఐకేపీ ఏపీఎం వెంకటరామిరెడ్డిని వివరణ కోరగా రూ.37వేలు జమకానీ మాట వాస్తవమేనని, ఈ విషయంలో సీసీ, వీఓ లీడర్‌ను విచారించి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. గతంలో రుణం తీసుకోవాలంటే వేలిముద్రలు మాత్రమే పెట్టి తీసుకొనేవారని, ప్రస్తుతం బయోమెట్రిక్ ఉండడం వల్ల ఒకరిపేరుతో మరొకరు తీసుకొనేందుకు అవకాశం లేదని వివరించారు.

గుత్తి ఆర్‌ఎస్‌లో పోలీసుల తనిఖీలు

గుత్తి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): గుత్తి ఆర్‌ఎస్‌లో శుక్రవారం ఎస్‌ఐ సురేష్ ఆధ్వర్యంలో పలు కాలనీలో నాకా బందీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాత నేరస్థులు, అనుమానిత ఇళ్లలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ నాగమాణిక్యం, సిబ్బంది పాల్గొన్నారు.

పెన్నానదిలోకి డ్రైనేజీ నీరు వదలడం దారుణం

తాడిపత్రి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక పెన్నానదిలోకి డ్రైనేజీనీరు వదలడం దారుణమని సీపీఐ పట్టణ కార్యదర్శి చిరంజీవియాదవ్ తెలిపారు. శుక్రవారం నాయకులతో కలిసి పెన్నానదిలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్నానదిలో డ్రైనేజీ నీరు కలవకుండా చూడాలన్నారు. ఈ నీరు వల్ల ప్రజలు అనారోగ్యం బారిన పడే అవకాశాలు ఉన్నాయన్నారు. గతంలో కూడా పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. ఆయన వెంట నాయకులు శ్రీరాములు, సూరి, రమణ, ఉమాగౌడ్ ఉన్నారు.

వక్క చెట్లకు నిప్పు

కుందుర్పి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సీగలపల్లి గ్రామానికి చెందిన రైతు మంజునాథ్‌కు చెందిన 250 వక్క చెట్లు శుక్రవారం అగ్ని ప్రమాదంలో కాలిపోయాయి. రైతు మంజునాథ్ రెండున్నరేళ్ల క్రితం 1500 వక్క మొక్కలు నాటాడు. చెట్లు ఏపుగా పెరిగాయి. ఇక రెండేళ్లలో కాపునకు వచ్చే సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో దాదాపు 250 మొక్కలు కాలిపోయాయి. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని రైతు మంజునాథ్ కోరారు.


కాలిబూడిదైన వక్క చెట్లు

చిగురించిన రైతుల ఆశలు

● ఉంతకల్లు రిజర్వాయర్ నిర్మాణానికి ప్రభుత్వం సన్నద్ధం ● డీపీఆర్‌కు రూ.3 కోట్లు మంజూరు

డీ.హీరేహాళ్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా కలగా మిగిలిపోయిన ఉంతకల్లు రిజర్వాయర్ నిర్మాణానికి కూటమి ప్రభుత్వం ఆమోదం తెలపడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. 2014-2019 మధ్య తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నపుడు రాయదుర్గం ఎమ్మెల్యేగా ఉన్న కాలవ శ్రీనివాసులు డి.హీరేహాళ్, బొమ్మనహాళ్ మండలాల నడుమ ఐదు టీఎంసీల నీటి సామర్థ్యం కలిగిన రిజర్వాయర్ నిర్మాణానికి సంకల్పించారు. అప్పట్లోనే ప్రభుత్వం నుంచి రిజర్వాయర్ నిర్మాణానికి ఆమోదం లభించింది. బొమ్మనహాళ్ మండలానికి చెందిన ఉంతకల్లు, డి.హీరేహాళ్ మండలానికి చెందిన మల్లికేతి, పులకుర్తి, హిర్దేహాళ్ గ్రామాలకు సంబంధించి సుమారు ఆరువేల ఎకరాలు వ్యవసాయ యోగ్యమైన భూములు సాగులోకి వచ్చి రైతుల జీవితాలను బాగుపడతాయని అప్పటి టీడీపీ ప్రభుత్వం రిజర్వాయర్ నిర్మాణానికి సంబంధించి పనులు ప్రారంభించారు. తర్వాత వైసీపీ ప్రభుత్వం రావడంతో రిజర్వాయర్ నిర్మాణానికి సంబంధించి పనులు పూర్తిగా ఆపివేశారు. వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు ఆ రిజర్వాయర్ నిర్మాణానికి సంబంధించి ఊసే లేకుండాపోయింది. గత ఎన్నికల్లో కాలవ శ్రీనివాసులు ఈ రిజర్వాయర్ నిర్మాణానికి సంబంధించి హామీ ఇచ్చారు. ఈ రిజర్వాయర్ నిర్మాణానికి సంబంధించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో ప్రత్యేకంగా చర్చించి ఆమోదం పొందేలా కృషి చేశారు. ఇదే సమయంలో నవంబర్ 30వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బొమ్మనహాళ్ మండలంలోని నేమకల్లు గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రసిద్ధిగాంచిన నేమకల్లు ఆంజనేయస్వామి సన్నిధిలో స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ రిజర్వాయర్ నిర్మాణం వెంటనే చేపట్టి పూర్తి చేస్తామని ప్రకటించారు. దీంతో రైతుల జీవితాలలో తిరిగి వెలుగులు నిండాయి. ప్రస్తుతం ఈ రిజర్వాయర్ నిర్మాణానికి సంబంధించి డీపీఆర్‌ను తయారు చేసేందుకు రూ. మూడుకోట్లు ప్రభుత్వ నిధులు మంజూరు చేసింది.


ఉంతకల్లు-నేమకల్లు మధ్య ప్రాజెక్టు నిర్మించనున్న ప్రదేశం

మా జీవితాలు మారిపోతాయి



56 ఎకరాల భూమి ఉన్నా వ్యవసాయాన్ని కాదనుకొని కూలీ పనులకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఆ భూములకు సాగునీటి వసతి లేక ఎండిపోతున్నాయి. ప్రతి సంవత్సరం నష్టపోవడంతో వ్యవసాయం చేయడం మానుకొని కుటుంబం మొత్తం కూలీ పనులకు వెళుతున్నాం. మా చుట్టు పక్కల చాలామంది రైతుల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. ఉంతకల్లు రిజర్వాయర్ నిర్మాణం చేపడితే మా జీవితాలు బాగుపడతాయి. ప్రస్తుతం రిజర్వాయర్ నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వం ప్రకటించడంతో మంచి రోజులు వస్తాయని వేచి చూస్తున్నాం.

- నరసింహ, రైతు, పులకుర్తి గ్రామం

మాట నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వం



ఎన్నికల ముందు రైతుల ఆవేదనను అర్థం చేసుకున్న కూటమి అభ్యర్థి కాలవ శ్రీనివాసులు ఉంతకల్లు రిజర్వాయర్ నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత పనులు చేపడతామని ప్రకటించారు. వెంటనే రిజర్వాయర్ నిర్మాణ పనులు చేపట్టాలి. రిజర్వాయర్‌పై ఎంతో మంది రైతులు ఆధారపడి ఉన్నారు. నిర్మాణం చేపడితే మల్లికేతికి సంబంధించి సుమారు రెండువేల ఎకరాలు వ్యవసాయ భూమి తిరిగి సాగులోకి వస్తుంది. నిర్మాణం చేపడితే రైతులెవరూ వలసలు వెళ్లాల్సిన అవసరం ఉండదు.

- మర్రిస్వామి, రైతు, మల్లికేతి గ్రామం

ఘనంగా హనుమద్‌వ్రతం


విశేష పుష్పాలంకరణలో నేమకల్లు ఆంజనేయస్వామి, కలుగోడు, ఆయతపల్లిలో ఆంజనేయస్వామి రథోత్సవం నిర్వహిస్తున్న గ్రామస్థులు

(న్యూస్ నెట్‌వర్క్- ఆంధ్రజ్యోతి)

హనుమద్‌వ్రతం సందర్భంగా పలు ఆలయాల్లో ఆంజనేయస్వామికి ప్రత్యేక అలంకరణలు, పూజలు చేశారు. బొమ్మనహాల్ మండలంలోని నేమకల్లులో వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం ఘనంగా హనుమద్ వ్రతాన్ని నిర్వహించారు. ప్రధానఅర్చకులు అనిల్‌కుమార్‌చార్యులు, సంతోష్‌కుమార్‌చార్యులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ సన్నిధిలో పూలరథోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో దేవదాయశాఖ అధికారి ఓబన్న, అన్నదాన కమిటీ చైర్మన్ తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు. గుమ్మఘట్ట మండలంలోని కలుగోడులో ఆంజనేయస్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. ప్రతి యేటా హనుమద్ వ్రతం సందర్భంగా ఇక్కడ ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు. కణేకల్లు మండలంలోని నాగేపల్లిలో ఆంజనేయస్వామి దేవాలయంలో వేదపండితుల ఆధ్వర్యంలో హోమాన్ని నిర్వహించారు. రాయదుర్గం మండలంలోని ఆయతపల్లిలో ఆంజనేయస్వామి రథోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం రథాన్ని పూలతో అలంకరించి స్వామివారిని ప్రతిష్ఠించి గ్రామపురవీధుల్లో నంది కోళ్లతో యువకులు నృత్యాల మధ్య ఊరేగించారు. ఈ సందర్భంగా రాయదుర్గం ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు గ్రామానికి చేరుకుని ఆంజనేయస్వామి దేవాలయంలో స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. యల్లనూరు మండలంలోని చిలమకూరు ఆంజనేయస్వామి జయంతి వేడుకలు రాత్రి ముగిశాయి. హోమాది కార్యక్రమాల అనంతరం, సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. రాతిదూలం పోటీల్లో గెలుపొందిన వృషభరాజుల యజమానులకు గ్రామ సర్పంచు నాగరాజు బహుమతులు అందజేశారు. గుంతకల్లు మండలంలోని కసాపురం శివారులోని శ్రీ లక్ష్మీనారాయణస్వామి దేవాలయంలో హనుమద్ వ్రతాన్ని పురస్కరించుకుని ప్రసన్నాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. తాడిపత్రి పట్టణ సమీపంలోని కడప రహదారిలో ఉన్న యోగివేమన ఆశ్రమంలో హనుమాన్ జయంతి వేడుకలు జరిగాయి.


కసాపురం లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో ప్రసన్నాంజనేయస్వామి

ఏకగ్రీవానికి సన్నాహాలు

● రైతుల మధ్య సామరస్యంగా చర్చలు
● నేడు సాగునీటి సంఘాలకు ఎన్నికలు

రాయదుర్గం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం చేపట్టిన సాగునీటి సంఘాల ఎన్నిక రాయదుర్గం నియోజకవర్గంలో లాంఛనంగా సాగనున్నాయి. రైతుల మధ్య సమన్వయంతో చర్చల రూపంలో అభ్యర్థులను ఎంపిక చేసుకుని ఎన్నికల్లో పోటీ చేయిస్తున్నారు. దీంతో దాదాపుగా సయోధ్యతో ఎన్నిక ఏకగ్రీవంగా సాగేపరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇప్పటికే ప్రభుత్వం సాగునీటి ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేసింది. శనివారం ఎన్నిక లాంఛనం కానున్నట్లు కనిపిస్తోంది. 2015లో జరిగిన సాగునీటి ఎన్నికలు తొమ్మిదేళ్ల అనంతరం జరుగుతున్నాయి. చెరువులు, ప్రాజెక్టుల కింద సాగునీటి సమస్యలు తలెత్తినపుడు అధికారులకు తలనొప్పులు ఎదురయ్యేవి. ప్రస్తుతం ఎన్నికల ప్రక్రియను ప్రభుత్వం పూర్తి చేస్తుండడంతో సాగునీటి సంఘాలపై మరింత బాధ్యత పెరిగి అధికారులకు కొంతమేరకు ఊరట కలిగిస్తోంది. దీంతో శనివారం జరిగే ఎన్నికలను రైతులు ఉత్సాహంగా జరుపుకునే దిశగా ముందడుగు వేస్తున్నారు. రాయదుర్గం నియోజకవర్గంలో ఇప్పటికే నోటిఫికేషన్ విడుదల చేసి నామినేషన్ల ప్రక్రియను చేపట్టేందుకు అవసరమైన ఓటర్ల జాబితా కూడా అటు మైనర్ ఇరిగేషన్, ఇటు హెచ్ఎల్ఎంసీ అధికారులు పూర్తి చేశారు. భైరవానితిప్ప ప్రాజెక్టుతో పాటు హెచ్చెల్సీ కింద ఉన్న సాగునీటి సంఘాలే కీలకంగా ఉన్నాయి. టీసీ మెంబర్ల ఎన్నికతో పాటు డబ్ల్యూయూఏ చైర్మెన్‌ల ఎన్నిక కూడా శనివారమే పూర్తి కానుంది. ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమయ్యే ఎన్నిక ప్రక్రియలో దాదాపుగా ఏకగ్రీవంగా అయ్యే అవకాశాలే మెండుగా కనిపిస్తున్నాయి. ఎన్నికల్లో పోటీ చేస్తున్న రైతులు వారి పొలాలకు సంబంధించిన నీటితీరువ పన్ను బకాయిలను చెల్లించి అప్పు లేనట్లుగా రశీదులు కూడా పొందుతున్నారు. అధికారులు ఆయా గ్రామాలలో చేరుకుని ఎన్నికలు నిర్వహించేందుకు సన్నద్ధమై ఓటర్ల జాబితా ప్రకారం రైతులను సమాచారాన్ని అందించి ఎన్నికల్లో పాల్గొనేందుకు చైతన్య పరిచారు. పోలీసులు కూడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా బందోబస్తు చేపట్టారు.

పోలీస్‌స్టేషన్ సమీపంలోనే చోరీ

ఉరవకొండ, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వీరశైవ నగర్‌లోని టైలర్ కిరణ్ అనే వ్యక్తి ఇంట్లో శుక్రవారం దొంగలు చోరీకి పాల్పడ్డారు. కిరణ్ అతడి భార్య రత్నమతి అనంతపురం వెళ్లారు. ఉదయం ఉరవకొండ కు వచ్చి ఇంటికి తాళాలు పగులగొట్టి ఉండడాన్ని గమనించి పోలీసులకు సమాచారాన్ని అందించారు. ఎస్ఐ జనార్దన నాయుడు సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. అనంతరం క్లూస్‌టీం ఆధారాలను సేకరించారు. ఇంట్లోని బీరువాను దొంగలు ధ్వంసం చేసి విలువైన బట్టలను ఎత్తుకెళ్లినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారం రోజుల వ్యవధిలోనే నాలుగు చోట్ల చోరీలు జరగడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు.

రోటరీక్లబ్ ఆధ్వర్యంలో సంబరాలు

తాడిపత్రి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయస్థాయి చదరంగం పోటీల్లో దొమ్మరాజు గుకేశ్ విజేతగా నిలవడంతో రోటరీ, ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని గాంధీ సర్కిల్‌లో శుక్రవారం దొమ్మరాజు గుకేశ్ ఫ్లెక్సీ వద్ద సంబరాలు నిర్వహించి మిఠాయిలు పంచిపెట్టారు. చదరంగంలో ప్రపంచవిజేతగా భారతీయుడు నిలవడం మనందరికి గర్వకారణమని పలువురు తెలిపారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు పీవీ సుబ్రహ్మణ్యం, ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు కౌసర్‌బేగం, సభ్యులు రఫీ, మద్దిలేటి, రమేష్, కిషోర్, విక్రమ్, అలీ, కోచ్ సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.


సంబరాలు నిర్వహిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

ఇసుక దిబ్బలను పరిశీలించిన డ్వామా పీడీ

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

బొమ్మనహాళ్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): బొమ్మనహాళ్, కణేకల్లు మండలాల్లో విస్తరిస్తున్న ఇసుక దిబ్బలను శుక్రవారం అనంతపురం డ్వామా పీడీ సలీంబాషా, ఏపీడీ అయేషా పరిశీలించారు. ఈ నెల 11న ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'విస్తరిస్తున్న ఇసుకదిబ్బలు' అనే శీర్షికను వార్తను ప్రచురించడంతో స్పందించి పరిశీలించారు. బొమ్మనహాళ్, కణేకల్లు మండలాలలో దర్గాహొన్నూరు, గరుడచేడు, మాల్యం, బిదురకుంతం తదితర గ్రామాలలో ఇసుకదిబ్బలను పరిశీలించారు. అక్కడి రైతులతో ఇసుక దిబ్బల పరిస్థితిపై ఆరాతీశారు. సున్నితమైన ఇసుక వల్ల పంటలపై ప్రభావం పడుతుందని తెలిపారు. దీన్ని చౌడుభూములకు తరలిస్తే ఉపయోగంగా ఉంటుందన్నారు. ఆషాఢమాసంలో గాలులు ఎక్కువగా ఉండడం వల్ల గ్రామాల్లోకి వస్తుందని వీరి దృష్టికి తీసుకొచ్చారు. ఇసుకదిబ్బలను శాశ్వతంగా తొలగించే విధంగా మార్గం చేయాలని, ఈ సున్నితమైన ఇసుకను తరలించి అక్కడ పంటలు కూడా సాగుచేసుకునేందుకు సహకరించాలన్నారు. ఈ సందర్భంగా పీడీ విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల సీఎం చంద్రబాబునాయుడు నేమకల్లుకు వచ్చిన సందర్భంలో ఇసుకదిబ్బల నివారణకు చర్యలు తీసుకుంటామని చెప్పడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు పరిశీలనకు వచ్చినట్లు తెలిపారు. ఏ శాఖ నుంచి ఇసుకదిబ్బల నివారణకు అవసరమో విచారిస్తున్నట్లు తెలిపారు. పూర్తి నివేదికను తయారు చేసి కలెక్టర్‌కు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాయదుర్గం ఏపీడీ దేవరాజ్, ఏపీఓ సుధాకర్, టీఏలు సోమన్నగౌడ్, నరసింహచారి, మాజీ సర్పంచ్ కేశప్ప, టీడీపీ నాయకులు ముక్కన్న, నాగరాజు, ఆనంద్, మహ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.


దర్గాహొన్నూరు వద్ద ఇసుకదిబ్బలను పరిశీలిస్తున్న డ్వామా పీడీ

తప్పుడు కేసులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి

పామిడి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో తప్పుడు కేసులు పెట్టిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని ఓ వస్త్ర దుకాణంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తప్పుడు కేసులు పెట్టినవారిపై చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు వినతి పత్రాలు అందజేసి అలసిపోయామన్నారు. ఇచ్చిన వినతులు చెత్తబుట్టపాలయ్యాయన్నారు. దీంతో జిల్లా కోర్టులో పిటీషన్ వేశానని తెలిపారు. ఈ పిటీషన్‌పై ఎంతవరకైనా వెళ్తానని అన్నారు. అవసరమైతే హైకోర్టు, సుప్రీంకోర్టు వరకూ వెళ్లేందుకు సైతం వెనకాడబోనని ఆయన తెగేసి చెప్పారు.

టవర్ కూలకుండా మరమ్మతులు


మట్టితో గుంతలను పూడ్చివేస్తున్న దృశ్యం

యాడికి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మట్టి తరలింపుతో కూలడానికి అవకాశాలు ఎక్కువగా ఉన్న 220 కేవీ విద్యుత్ టవర్ చుట్టూ శుక్రవారం ట్రాన్స్‌కో ఈహెచ్‌టీ అధికారులు మరమ్మతులు చేపట్టారు. విద్యుత్ టవర్ చుట్టూ మట్టిని తోలారు. విద్యుత్ టవర్ కూలకుండా పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపడుతున్నారు. భవిష్యత్తులో విద్యుత్ టవర్ కూలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. ఈ పనులను అధికారులు సురేంద్రకుమార్, నాగేంద్రకుమార్ పర్యవేక్షించారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

బెళుగుప్ప, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని నరసాపురం గొల్లలదొడ్డిలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సప్రిన్ శుక్రవారం తెలిపారు. గొల్లలదొడ్డిలో సమస్యలను జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గౌతమ్‌కుమార్, మండల అధ్యక్షుడు సుధీర్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో డీఈ, ఏఈ హర్షవర్ధన్‌రెడ్డి సెక్రెటరీ శ్రీరాములుతో కలిసి గ్రామంలో పర్యటించారు. జలజీవన్ మిషన్ పథకం కింద ప్రతి ఇంటికి తాగునీటి కొళాయిలు ఏర్పాటు చేసి సమస్య పరిష్కరిస్తామన్నారు. బీజేపీ నాయకులు వన్నూరుస్వామి, జనసేన నాయకులు మురళి, రవి నాయక్ పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉపాధి కల్పనే లక్ష్యం


ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

ఉరవకొండ, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు ఉపాధి కల్పనే లక్ష్యంగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు మంత్రి పయ్యావుల కేశవ్ తనయులు విక్రమ్ సింహా, విజయ్ సింహా పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మెగా జాబ్ మేళా ఏర్పాట్లను వారు శుక్రవారం పరిశీలించారు. జాబ్‌మేళాకు రిజిస్ట్రేషన్ చేయించుకున్న అభ్యర్థులందరికీ కౌంటర్లలో టోకన్లు ఇస్తామన్నారు. జాబ్‌మేళాకు ఐదువేల మందికి పైగా నిరుద్యోగులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జాబ్‌మేళకు మంత్రి పయ్యావుల కేశవ్ హాజరుకానున్న నేపథ్యంలో గుంతకల్లు డీఎస్పీ శ్రీనివాస్, సీఐ మహానంది, ఎస్ఐ జనార్ధననాయుడు, ఎంపీడీవో రవిప్రసాద్ ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో మంత్రి వ్యక్తిగత కార్యదర్శి గుర్రం నందకుమార్, టీడీపీ నాయకులు విజయ్‌భాస్కర్, కేశవానంద, గోవిందు, ఎర్రిస్వామి, రహంతుల్లా, అల్లాబకాష్, నరసింహులు పాల్గొన్నారు.

రైతుల అభిప్రాయాల సేకరణ


ఉద్యానవన రైతులను అభినందిస్తున్న అధికారులు

కణేకల్లు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర-2047 ఏర్పాటులో కణేకల్లు రైతుల సలహాలు, సూచనలను అధికారులు సేకరించారు. మండలంలోని గోపులాపురం గ్రామానికి చెందిన ఉద్యానవ రైతు గరికపాటి బసవరాజుతో పాటు నరసాపురం మురళి, కోనాపురం పురుషోత్తం అభిప్రాయాలను సేకరించి పది అంశాల ప్రణాళికలో పొందుపరిచారు. ప్రధానంగా ఉద్యానవ సాగులో పలు సలహాలను వీరి ద్వారా సేకరించారు. దీంతో విజయవాడలో శుక్రవారం జరిగిన స్వర్ణాంధ్ర కార్యక్రమానికి వీరిని ఆహ్వానించి అభినందించారు. కార్యక్రమంలో ఏపీఐఎంపీ పీఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన అధికారులు

విడపనకల్లు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్ద కొట్టాలపల్లి, చీకలగురికి, విడపనకల్లు, జనార్దనపల్లి గ్రామాలకు చెందిన పంట పొలాల్లో శుక్రవారం అటవీశాఖ అధికారులు పర్యటించారు. నాలుగు రోజుల క్రితం విడపనకల్లు మండలం పెద్ద కొట్టాలపల్లి రైతులు తమ పంట పొలాలను జింకల బారి నుంచి కాపాడాలని కోరుతూ జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. పప్పుశనగ, జొన్న పంటలను జింకలు తిని పంటలను నాశనం చేస్తున్నాయని, వాటి వల్ల వందలాది ఎకరాల్లో పంటలను కోల్పోతున్నామని తెలిపారు. దీంతో జిల్లా అధికారులు స్పందించి విడపనకల్లు మండలంలో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేయాలని ఆదేశించారు. వందల సంఖ్యలో ఉన్న జింకలను తరలించేందుకు సాధ్యం కాదని, పంటలను కాపాడుకునే ప్రయత్నాలు చేసుకోవాలని తెలిపారు. జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని అన్నారు.

జానపద కళాకారుడికి గౌరవ డాక్టరేట్

గుమ్మఘట్ట, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోనబావిలో నివసిస్తున్న పోగునూలు రంగస్వామి కనుమరుగు అవుతున్న నాటకరంగంలో చేస్తున్న కృషిని గుర్తించి హైదరాబాద్‌లోని ఫ్రెండ్‌షిప్ మినిస్ట్రీస్ సంస్థ గౌరవ డాక్టరేట్‌ను శుక్రవారం అందజేసింది. ఈయన పౌరాణిక పద్యనాటకాల్లో ఎన్నో పాత్రలు పోషించారు. ఈ సందర్భంగా రంగస్వామి మాట్లాడుతూ.. నాటకరంగంలో మరింత కృషి చేసి భావితరాలకు ఆసక్తి కలిగేలా కృషి చేస్తానని తెలిపారు. తన కుమారులను కూడా నాటకరంగంలో రాణించేలా నుంచే తర్ఫీదు ఇస్తూ పలు నాటకాల్లో నటింపజేశానని పేర్కొన్నారు.


పోగునూలు రంగస్వామికి డాక్టరేట్‌ను అందిస్తున్న ఫ్రెండ్‌షిప్ మినిస్ట్రీస్ సంస్థ సభ్యులు